


https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY




సంపుటి 10 | సంచిక 177 | కర్నూలు | శుక్రవారం జూలై 25 2025

పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi

# క్వాంటం వాలీలో క్యూపిఐఏఐ భాగస్వామ్యం

### అధునాతన 8 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు

### చంద్రబాబుతో సంస్థ వ్యవస్థాపకుడు నాగేంద్ర నాగరాజన్ సమావేశం

### అమరావతిలో ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటుకు చంద్రబాబు సూచన

అమరావతి,జూలై24:(శ్రీచక్ర) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమారవతి క్వాంటం వాలీలో క్యూపిఐఏఐ భాగస్వామ్యం కానుంది. నేషనల్ క్వాంటం మిషన్‌లో భాగంగా దేశంలోనే తొలిసారిగా అమరావతిలో ఏర్పాటు- చేస్తున్న క్వాంటం వ్యాలీలో క్యూపీఐఏఐ కూడా భాగస్వామ్యం వహించనుంది. దీనిలో అధునాతన 8 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటుకు క్యూపిఐఏఐ సంస్థ ముందుకు వచ్చింది. ఈ క్రమంలో అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడేలా కేంద్రాన్ని ఏర్పాటు- చేయాలని సిఎం అధికారులకు సూచించారు. సిఎం చంద్రబాబుతో క్యూపిఐఎఐ సంస్థ వ్యవస్థాపకుడు నాగేంద్ర నాగరాజన్ సమావేశం అయ్యారు. అమరావతిలో ఏర్పాటు- చేస్తున్న క్వాంటం వ్యాలీ క్యూపిఐఎఐ సంస్థ భాగస్వామ్యం అయ్యారు. విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడేలా కేంద్రాన్ని ఏర్పాటు- చేయాలని, అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు- చేయాలని అధికారులకు సిఎం ఆదేశాలిచ్చారు. అధునాతన 8 క్యూబినేట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటుకు క్యూపిఐఎఐ సంస్థ ముందుకొచ్చిందని చంద్రబాబు తెలియజేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ సంస్థ వ్యవస్థాపకులు నాగేంద్ర నాగరాజన్‌తో చర్చించారు. ప్రజల



ప్రయోజనాల కోసం ఉపకరించే ఆవిష్కరణలు, అలాగే, విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడేలా ఈ కేంద్రాన్ని ఏర్పాటు- చేయాలని సిఎం అన్నారు. దీనితో పాటు- అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు- చేయాలని ముఖ్యమంత్రి క్యూపిఐఏఐను కోరారు. తద్వారా విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్‌లు క్వాంటం అల్గారిథంలు, అప్లికేషన్‌లను రూపొందించుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వివిధ పంటల సాగులో కచ్చితత్వం, తెగుళ్లకు సంబంధించిన అంశాలను అంచనా వేసేందుకు క్వాంటం కంప్యూటింగ్ ఉపకరించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అదే సమయంలో వ్యవసాయ ఉత్పత్తి పెరిగేలా సూచనలు, సలహాలను సకాలంలో ఇవ్వటం ద్వారా రైతుల ఆదాయాలను మెరుగుపడేందుకు ఈ సాంకేతికత దోహద పడాలని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో నీటి వనరులను సమర్ధంగా నిర్వహించేందుకు వీలుగా క్వాంటం టెక్నాలజీని వాడాలన్నారు. వ్యాధుల నిర్ధారణ, మెడికల్ లాజిస్టిక్స్ తదితర అంశాల్లోనూ క్వాంటం సిమ్యులేషన్‌ను సమర్ధంగా వినియోగించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. యువతకు నైపుణ్యాలను కల్పించే అంశంలోనూ క్వాంటం టెక్నాలజీ సహకారాన్ని తీసుకునేలా ప్రభుత్వం యోచన చేస్తోంది. క్వాంటం లాంటి ఆధునిక సాంకేతికత ద్వారా సామాన్య ప్రజల సామాజిక, ఆర్ధిక పరిస్థితుల్ని మెరుగు పర్చేలా ప్రభుత్వం కార్యాచరణ చేస్తోంది. విద్య, పరిశోధన, ఇన్నోవేషన్ రంగాల్లో డీప్ -టె-క్ ద్వారా సమాజానికి విస్తృత ప్రయోజనాలు కల్పించటమే లక్ష్యంగా క్యూపిఐఏఐ, నేషనల్ క్వాంటం మిషన్, అమరావతి క్వాంటం వ్యాలీ పనిచేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# ఏపిలో పెట్టుబడుల వెల్లువ

**రూ.70వేల కోట్ల పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం**

**ఐటీ, రెన్యువబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్, డ్రోన్,ఆటోమొబైల్స్ రంగాల్లో పెట్టబుడులు**

**క్వాంటమ్ వ్యాలీ మాదిరిగా గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ**

**స్టార్టప్ ఏరియా అభివృద్ధికి సింగపూర్ కన్సార్టియం రాక**

**పలు సంస్థలకు భూ కేటాయింపులకు నిర్ణయం**

**నిరుపేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు**

**నీటి పన్నుపై వడ్డీని పూర్తిగా రద్దు చేయాలని కేబినెట్ నిర్ణయం**

**వివరాలను వెల్లడించిన మంత్రి పార్థసారథి**




అమరావతి,జూలై24(శ్రీచక్ర) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర పడింది.. లిక్కర్ కేసు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలకి కౌంటర్లు, సుపరిపాలన తొలి అడుగుపై చర్చించింది. మొత్తంగా 42 అజెండా అంశాలపై కేబినెట్‌లో చర్చ సాగింది.. ఎల్ఆర్ఎస్‌కు ఆమోదం తెలిపిన కేబినెట్.. ఎస్ఐపిబి ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.. సీఆర్డీఏ ప్రతిపాదనలకు సంబంధించి చర్చించి ఆమోదం తెలిపింది మంత్రివర్గం.. నాలా చట్ట సవరణకు సంబంధించి చర్చించి.. ఆమోదం తెలిపారు.. ఇక, పలు సంస్థలకు భూ కేటాయింపుపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు.. రెండు కొత్త పాలసీలకు సంబంధించి కేబినెట్‌లో చర్చించి.. ఆ తర్వాత ఆమోదముద్ర వేశారు.. ఏపీలో మొత్తం రూ.70వేల కోట్ల పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటన్నింటినీ గ్రౌండ్ చేయించిన పక్షంలో లక్షమందికి ఉద్యోగాలు వస్తాయని సీఎం తెలిపారు. వీటిని మనం వెంటబడి మరీ గ్రౌండ్ చేయించాలని సూచించారు. ఐటీ, రెన్యువబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్, డ్రోన్, ఆటోమొబైల్స్ రంగాల్లో ఈ పరిశ్రమలు వస్తున్నాయని ముఖ్యమంత్రి వివరించారు. త్వరలో ఇల్లు లేని నిరుపేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు-, పట్టణాల్లో రెండు సెంట్లు- ఇచ్చే కార్యక్రమం వెంటనే చేపట్టాలని.. ఈ విషయంపై అందరూ దృష్టి సారించాలని మంత్రులకు మార్గనిర్దేశంచేశారు సీఎం చంద్రబాబు. క్వాంటమ్ వ్యాలీ మాదిరిగా మనం గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీలో కూడా అందరి కంటే ముందు ఉండాలని.. దీనివల్ల మనకు ప్రయోజనం ఎక్కువగా ఉంటుందని చెప్పుకొచ్చారు. సింగపూర్‌తో సంబంధాలపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయినప్పుడు మన చూపించిన చొరవతో సింగపూర్ ప్రభుత్వం ముందుకు వచ్చి సహాయం చేసిందని గుర్తు చేశారు. సింగపూర్ ప్రభుత్వం కూడా అలానే సహాయం చేసిందనిసీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. గతంలో అమరావతి రాజధానిలో స్టార్టప్ ఏరియా అభివృద్ధికి సింగపూర్ కన్సార్టియం ముందుకు వచ్చిందని.. కానీ ప్రభుత్వం మారిన తర్వాత ఆ కంపెనీ నిర్వాహకులను అప్పటి సీఎం జగన్ వెళ్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కంపెనీ నిర్వాహకులపై జగన్ ప్రభుత్వం అవినీతి ముద్ర వేసిందని ధ్వజమెత్తారు. సింగపూర్ కన్సార్టియం నిర్వాహకులపై కేసు పెట్టేందుకు కూడా ప్రయత్నం చేశారని.. దీంతో వాళ్లు ఏపీపై పూర్తిగా అసంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు. సింగపూర్‌తో సంబంధాలు అన్నింటిని కూడా జగన్ చెడగొట్టారని.. అందుకనే వాళ్లతో మళ్లీ మన సంబంధాలను పునరుద్ధరించుకోవాలని సూచించారు సీఎం చంద్రబాబు. సింగపూర్ కన్సార్టియం నిర్వాహకులు సీడ్ క్యాపిటల్ మినహా ఏ ప్రాజెక్ట్ అయినా చేపడతామని అంటున్నారని సీఎం గుర్తుచేశారు. 2024 నుంచి 2025 సంవత్సరానికి నీటి పన్నుపై వడ్డీని పూర్తిగా రద్దు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే తిరుపతి తొక్కిసలాటపై జస్టిస్ సత్యనారాయణ మూర్తి ఇచ్చిన కమిషన్ నివేదికపై చర్చించారు. ఇరువురు అధికారులపై చర్యలు తీసుకోవాలని మంత్రిమండలి ఆదేశాలు జారీ చేసింది. గో సంరక్షణ అధికారి, మరో డీఎస్పీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కేబినెట్ ఆదేశించింది.

# ఇండియా, ఇంగ్లాండ్ మధ్య కీలక వాణిజ్య ఒప్పందం



భారత్-బ్రిటన్ సంబంధాల్లో ఇవాళ చరిత్రాత్మక రోజు అని ప్రకటించారు భారత ప్రధాని నరేంద్ర మోదీ. చాలా ఏళ్ల కృషి తర్వాత భారత్-బ్రిటన్ మధ్య సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందంపై సంతకాలు జరగడం సంతోషకరమన్నారు. ౦ఎ, సైబర్ సెక్యూరిటీ అంశాల్లో ఇరుదేశాలు కలిసి ముందుకు సాగుతామని మోదీ చెప్పారు. బ్రిటన్, భారత్ భాగస్వామ్యంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని కూడా మోదీ తెలిపారు.భారత్‌లో త్వరలో ఆరు బ్రిటన్ వర్సిటీలు తమ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తున్నాయని ప్రధాని మోదీ చెప్పారు. ఇరుదేశాల సేవల రంగం.. ఆర్థిక, సాంకేతిక రంగాలకు ఊతమిస్తుందని మోదీ అన్నారు. ఈ ఒప్పందం ద్వారా సులభతర వాణిజ్య విధానానికి మరింత ఊతం వచ్చిందని వ్యాఖ్యానించారు. 'ఇరుదేశాల మధ్య ఉపాధి విస్తృతం అవుతాయి. భారత్-బ్రిటన్ భాగస్వామ్యంలో విజన్-2035 లక్ష్యంగా సాగుతున్నాం.' అని మోదీ తెలిపారు.

# పేర్ని నానికి హైకోర్టులో ఊరట

### 31 వరకు ఎలాంటి తొందరపాటు చర్యలు వద్దని ఆదేశం

అమరావతి,జూలై24 (శ్రీచక్ర) : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నానికి మరోసారి కోర్టులో ఊరట లభించింది.. ఈ నెల 31వ తేదీ వరకు పేర్ని నానిపై ఎటువంటి తొందరపాటు- చర్యలు తీసుకోవద్దని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులు పొడిగించింది.. మాజీ మంత్రి పేర్ని నాని ఇటీవల రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై కేసులు నమోదు అయ్యాయి.. దీంతో, ముందస్తు రక్షణ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు నాని.. మరోవైపు, ఈ రోజు కేసు రీచ్ కాక పోవడంతో మధ్యంతర ఉత్తర్వులను పొడిగించాలని కోరారు పేర్ని నాని తరపు న్యాయవాదులు.. దీంతో, కేసు తదుపరి విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసిన హైకోర్టు.. అప్పటి వరకు ఉత్తర్వులను పొడిగిస్తున్నట్టు- పేర్కొంది.. దీంతో, హైకోర్టులో మాజీ మంత్రి పేర్ని నానికి మరోసారి ఏపీ హైకోర్టులో ఊరట దక్కినట్టు- అయ్యింది..



# 26 నుంచి సింగపూర్ పర్యటనకు చంద్రబాబు

### పెట్టుబడులే లక్ష్యంగా సిఎం పర్యటన

అమరావతి,జూలై24(శ్రీచక్ర) ఆంధ్రప్రదేశ్ కు పెట్టుబడులను ఆకర్షించటమే లక్ష్యంగా ముఖ్యమం త్రి చంద్రబాబు నాయుడు సింగపూర్ లో పర్యటించ నున్నారు. ఈ నెల 26 నుంచి 31 తేదీ వరకు 6 రోజుల పాటు- ఆయ౯న పర్యటించి దిగ్గజ సం స్థల ప్రతినిద౯ులు, యాజమాన్యాలు, ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలతో భేటీ కానునా న్రరు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత దావోస్ పర్యట నకు వెళ్లిన సిఎం...రెండో విదేశీ పర్యటనగా సింగపూర్ కు వెళు తున్నా రు. బ్రాండ్ ఎపి ప్రమోషన్ తో రాష్ట్రానికి పెట్టు-బడులను సాధించేందుకు ఈ పర్యటనను వేదిక చేసుకోనున్నారు. ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన పారిశ్రామిక పాలసీలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజెనెస్ విధానాలను వివరించి పెట్టు-బడుదారులను ఆహ్వానించ నున్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవేలు, హార్బర్లు, భూముల లభ్యత, కనెక్టివిటీ-, 1053 కి.మీ తీర ప్రాంతం, నిపుణులైన మానవ వనరులు గురించి వివరించనున్నా రు. అలాగే పారిశ్రావి ౹క



వేత్తలను పెట్టు-బడులు పెట్టాల్సింది గా కోరనున్నారు. 6 రోజుల పర్యటనలో సీఈఓలు, కంపెనీల ప్రతినిధులతో భేటీ- కానున్నారు. మొదటి రోజు సింగపూర్ సహా సమీప దేశాల్లో నివసిస్తున్న ప్రవాసాంధ్రుల సంఘం నిర్వహించే 'తెలుగు డయాస్పోరా' సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొనను న్నారు. ఎపిలో పెట్టబడులపై ఆయా దేశాల వారిని ఆహ్వానించనున్నారు. పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సిఎం పారిశ్రామిక వేత్తలను కోరనున్నారు. ఏపీలో పోర్టు ఆధారిత ప్రాజెక్టులు, సెమి కండక్టర్లు, ఏఐ, డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన పెట్టు-బడులపై ముఖ్యమంత్రి చర్చించనున్నారు. ఈ ఏడాది నవంబరులో విశాఖలో ౼ పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించేందుకు గానూ ఆ దేశానికి చెందిన ప్రముఖులతోనూ ముఖ్యమంత్రి భేటీ- కానున్నారు. డిజిటల్ ఎకానమీ, ఫిన్-టె-క్‌పై నిర్వహించే బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశాల్లో కూడా ముఖ్యమంత్రి పాల్గొంటారు.

# బీఎస్-6 వాహనాలనూ నిషేధిస్తారా.. ఈ నెల 28న సుప్రీంకోర్టు కీలక విచారణ

నేషనల్ క్యాపిటల్ రీజియన్ లో పెట్రోల్, డీజిల్ వాహనాలకు నిర్దేశించిన వయో పరిమితి బీఎస్-6 ప్రమాణాలు కలిగిన వాహనాలకు సైతం వర్తిస్తుందా లేదా అని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ నెల 28న విచారించనున్నది. వాస్తవానికి పెట్రోల్ వాహనాలకు 15 సంవత్సరాలు, డీజిల్ వాహనాలకు కేవలం పదేళ్లు మాత్రమే వయో పరిమితి ఉంది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్ బెంచ్ ముందుకు వచ్చిన పిటిషన్‌ను విచారించేందుకు అంగీకరించింది. ఈ విషయం చాలా ముఖ్యమైందని.. కోర్టు సూచనలను విస్మరించి ప్రభుత్వం నియమాలను అమలు చేయడం లేదని పిటిషన్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఢిల్లీలోని కాలుష్యాన్ని నియంత్రించడానికి సుప్రీంకోర్టు ఇప్పటికే వాహనాలకు వయో పరిమితులను నిర్ణయించిందని న్యాయవాది తెలిపారు.కోర్టు ఆమోదం లేకుండా వాటిని మార్చే హక్కు ప్రభుత్వానికి లేదన్నారు. ఈ పరిస్థితుల్లో బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న కొత్త టెక్నాలజీ వాహనాలకు పాత నియమాలే వర్తిస్తాయో లేదో స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అయితే, అందరి దృష్టి ఈ నెల 28న జరిగే విచారణపై నడుస్తున్న కొత్త బీఎస్-6 వాహనాలను కూడా నిర్దిష్ట సమయం తర్వాత నిలిపివేస్తారా? లేదంటే ఉపశమనం ఇస్తారా? అనేది వేసి చూడాల్సిందే. చట్టం ప్రకారం, ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం (ఔఅఖీ)లో డీజిల్ వాహనాల ప్రస్తుత జీవితకాలం 10 సంవత్సరాలు. అన్ని పెట్రోల్ వాహనాలకు 15 సంవత్సరాలు. పెరుగుతున్న కాలుష్య స్థాయిలను తగ్గించే ప్రయత్నంలో 2015లో భారతదేశ జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఔఉ) ఎన్‌సీఆర్‌లో పదేళ్ల కంటే పాత డీజిల్ వాహనాలు, 15 సంవత్సరాల ఆదేశించిందని పలు నివేదికలు పేర్కొన్నాయి.

# సంపాదకీయం

## మేకిన్ ఇండియా సక్సెస్ స్టోరీ

ఓవైపు రష్యా – ఉక్రెయిన్ యుద్ధం జరుగుతోంది. మరోవైపు ఇజ్రాయెల్ – పాలస్తీనాల మధ్య వార్ సాగుతోంది. ఇజ్రాయెల్ – ఇరాన్ల మధ్య పరిమిత యుద్ధం జరిగింది. ఇదే సమయంలో ఇండియా – పాకిస్థాన్ల మధ్య కూడా యుద్ధం జరిగింది. అయితే, మిగతా యుద్ధాల్లో జరగని చర్చ ఇండియా – పాకిస్థాన్ యుద్ధం తర్వాత జరుగుతోంది. అదే ఆయుధాల వినియోగం. రష్యా ఉక్రెయిన్ కన్నా బలమైన దేశం. ఇజ్రాయెల్ యుద్ధ సన్నద్ధత, ఆయుధ వ్యవస్థల విషయంలో పాలస్తీనా, ఇరాన్ కన్నా బలమైన దేశం. కానీ ఈ రెండు దేశాలు తమ ప్రత్యర్థులపై దాడులు చేసే క్రమంలో వారి బలంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రష్యా రెండేళ్లుగా ఉక్రెయిన్పై యుద్ధం చేస్తున్నా, ఆ యుద్ధంలో విజయం సాధించలేకపోతోందన్నది ప్రధాన ఆరోపణ. ఇక ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందినప్పటికీ, ఇరాన్ వేసిన కొన్ని రాకెట్లను అడ్డుకోలేకపోయిందన్న వాదన వినపడింది. బ్రహ్మోస్ క్షిపణులు ఆపరేషన్ సింధూర్లో భాగంగా మన దేశం పాకిస్థాన్పై తొలిసారిగా బ్రహ్మోస్ క్షిపణులను ప్రయోగించింది. ఇది ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణిగా గుర్తింపు ఉంది. భారత్ – రష్యా సంయుక్తంగా ఈ మిస్సైల్ను డిజైన్ చేసినప్పటికీ, మన దేశ సాంకేతికత, డిజైన్, తయారీలో భాగస్వామ్యం ఎక్కువగా ఉంది. ఈ క్షిపణికి మన దేశంలోని బ్రహ్మపుత్ర నది పేరును, రష్యాలోని మోస్క్వా నది పేర్లను కలిపి ఈ క్షిపణికి బ్రహ్మోస్గా నామకరణం చేశారు. ఈ మిస్సైల్ వేగం, కచ్చితంగా పాక్లోని ఉగ్రవాద శిబిరాలు, కమాండ్ సెంటర్లను ధ్వంసం చేయడంలో కీలకంగా పనిచేశాయి. ఆత్మనిర్భర్ భారత్లో భాగంగా మన దేశీయంగా (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్) అభివృద్ధి చేసిన రక్షణ వ్యవస్థ. ఇది సర్ఫేస్–టు–ఎయిర్ క్షిపణి వ్యవస్థ. ఇది మధ్య శ్రేణి క్షిపణులను, తక్కువ ఎత్తులో వచ్చే శత్రు డ్రోన్లను అడ్డుకునేందుకు వినియోగిస్తారు. దీని తయారీలో డీఆర్డీవోతో పాటు భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు కలిసి ఉత్పత్తి చేశాయి. ఆకాష్ ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్స్ 25 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంది. దీని వేగం సూపర్ సోనిక్ వేగంతో ప్రయాణిస్తుంది. అంటే శబ్దం కంటే 2.5 రెట్లు ఎక్కువ వేగంతో ప్రయాణించే క్షిపణి వ్యవస్థగా చెప్పవచ్చు. దీనికి ఉన్న మరో ప్రత్యేకత ఏంటంటే, ఇది డ్రోన్లు, యుద్ధ విమానాలను, హెలికాప్టర్లను, వాటితో పాటు క్రూయిజ్ క్షిపణులను కూడా అడ్డుకోగలదు. అంతేకాదు, ఒకేసారి బహుళ లక్ష్యాలను ఛేదించగలిగే సామర్థ్యం ఆకాష్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థకు ఉంది. ఇందులో ఏర్పాటు చేసిన రాజేంద్ర అనే రాడార్ వ్యవస్థ మల్టీపుల్–ఫంక్షన్ ఫేజ్డ్–అరే రాడార్ను వినియోగిస్తుంది. ఈ రాడార్ వల్ల ఒకేసారి అనేక టార్గెట్లను ఇది ట్రాక్ చేయగలదు. అప్పటికప్పుడు ఆ లక్ష్యాలను ఛేదించేందుకు ఆకాష్ క్షిపణులకు డైరెక్షన్ ఇవ్వగల సామర్థ్యం ఉంది. దీని ద్వారా పాకిస్థాన్ మన సరిహద్దుల నుండి ప్రయోగించిన డ్రోన్లను గుర్తించి, వాటిని జామ్ చేసి, ధ్వంసం చేయడంలో కీలక పాత్ర పోషించాయి. సైనిక స్థావరాలతో పాటు డ్రోన్ దాడుల నుండి ప్రజలను, వారి ఆస్తులను కాపాడటంలో విశేషంగా పనిచేశాయని చెప్పాలి. సరిహద్దులను దాటి వచ్చే డ్రోన్లను గుర్తించడం, వాటిని జామ్ చేసి ధ్వంసం చేయడం ఈ డీ4 యాంటీ–డ్రోన్ సిస్టమ్స్ పని. మన దేశంలోని కీలక సైనిక స్థావరాలు, వ్యూహాత్మక ప్రాంతాలు, నగరాలు, పట్టణాలను శత్రు డ్రోన్ల నుండి కాపాడే రక్షణ వ్యవస్థగా దీన్ని రూపొందించారు. తక్కువ రాడార్ క్రాస్ సెక్షన్ ఉన్న చిన్నపాటి డ్రోన్లను కూడా గుర్తిస్తుంది. డ్రోన్ల కమాండ్ అండ్ కంట్రోల్ సిగ్నల్లను, అలాగే సిగ్నల్లను గుర్తించి, ట్రాక్ చేస్తుంది. పగలు, రాత్రి తేడా లేకుండా డ్రోన్లను గుర్తించి నిర్ధారించడానికి, ట్రాక్ చేయడానికి ఇందులో ఏర్పాటు చేసిన ఎలక్ట్రో–ఆప్టికల్/ఇన్ఫ్రారెడ్ సెన్సార్లు ఉపయోగపడతాయి. ఇక ఇందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ అల్గోరిథంలను వాడి, ఏ లక్ష్యాన్ని గుర్తించిందో ఆ టార్గెట్ ఉద్దేశాన్ని, ముప్పు ఎక్కడ ఉంది, ఏ స్థాయిలో ఉందని అంచనా వేసి, తదనుగుణంగా వేగంగా నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యం ఉంది. ఇది కృత్రిమ మేధస్సుతో కూడిన గగనతల నియంత్రణ, నివేదన వ్యవస్థగా చెప్పవచ్చు. ఏఐ ఆధారిత వ్యవస్థ. దీన్ని డీఆర్డీవో, ఇస్రో, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన వ్యవస్థే ఆకాష్ తీర్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ. ఇది కేవలం ఒక క్షిపణి వ్యవస్థగా చెప్పలేం. ఇది వైమానిక స్థావరాలు, రక్షణ సంస్థల ఆస్తులను శత్రువుల దాడుల నుంచి కాపాడుతుంది. శత్రువుల దాడులను ట్రాక్ చేయడం, వాటికి ప్రతిస్పందించడంలో సహాయం చేసే పాత్ర ఆకాష్ తీర్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ప్రత్యేకత. వివిధ రక్షణ వ్యవస్థల నుంచి అంటే రాడార్లు, క్షిపణి వ్యవస్థలు, శాటిలైట్స్ నుండి వచ్చే సమాచారం సేకరించి, వాటిని పరిశీలించి, అవసరమైన సమాచారాన్ని ప్రాసెస్ చేసి అందిస్తుంది. ఇందులో ఉపయోగించే ఏఐ టెక్నాలజీ ద్వారా డ్రోన్లు, క్షిపణులు, విమానాలను ట్రాక్ చేసి గుర్తించడం, వాటిని ఎదుర్కొనేందుకు తక్షణ నిర్ణయాలను తీసుకుంటుంది.

# పట్టణ నడిబొడ్డున ఉన్న మాచాని సోమప్ప సర్కిల్ పేరును ముమ్మాటికి మారదు






ఎమ్మిగనూరు,జూలై, 24 (శ్రీ చక్ర ):-ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ని చేనేతల నుండి దూరం చేయాలనే కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. విభేదాలు సృష్టించడమే కోనేరు పని అని తెలిపారు. ప్రజలు కోనేరు నాగేంద్ర ప్రసాద్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఎవరు నమ్మవద్దని తెలిపారు. పట్టణం సుందరీకరణలో భాగంగా జాతీయ జెండాను పెడుతున్నారని సృష్టించడమే వారి పని అని తెలిపారు. ఎన్ని తరాలు వచ్చిన పట్టణ నడిబొడ్డున ఉన్న మాచని సోమప్ప పేరు ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పట్టణ టిడిపి నాయకులు వెల్లడించారు. ఎమ్మిగనూరు పట్టణ నడిబొడ్డున ఉన్న సోమప్ప సర్కిల్ అనే పేరును మారుస్తున్నారన్న అపోహలు ప్రజలు నమ్మవద్దని, సోమప్ప సర్కిల్ పేరు అసలు జీవితంలో ముమ్మాటికీ మారదని తేల్చి చెప్పారు. సోమప్ప సర్కిల్ వద్ద 100 అడుగుల జాతీయ జెండాను ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయ నాగేశ్వర్ రెడ్డి ఆలోచన చేశారని దాన్ని కోనేరు నాగేంద్ర ప్రసాద్ వక్రీకరిస్తూ, జాతీయ జెండాను పెడితే సోమప్ప సర్కిల్ పోతుందని మాట్లాడడం అవివేకంగా ఉందని టీడీపీ పట్టణ అధ్యక్షులు మాచాని మహేష్, చేనేత టీడీపీ నాయకులు దామా నరసింహులు, టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ బండా నరసప్ప, నాయకులు మీనప్ప, ఈరన్న, బుగిడె నాగరాజు, కామర్తి మహేష్, హరి, బీమేష్ లు పేర్కొన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణ నడిబొడ్డున ఉన్న మాచని సోమప్ప సర్కిల్ పేరు ఎప్పటినుండో ప్రసిద్ధి ప్రసిద్ధిగాంచినీదని తెలిపారు. ఎమ్మిగనూరు మున్సిపాలిటీని స్పెషల్ గ్రేడ్– 1 కావడం పట్ల సుందరీకరణలో భాగంగా అనేక మార్పులు, చేర్పులు జరుగుతున్నాయన్నారు. ఎన్ని తరాలు వచ్చిన సోమప్ప సర్కిల్ పేరును ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎమ్మిగనూరును కోసిగి పంచాయతీ పరిధిలో ఉంటే దాన్ని రప్పించిన ఘనత మాచాని సోమప్ప కే దక్కిందని తెలిపారు. అలాగే ఎమ్మిగనూరు మున్సిపాలిటీని అభివృద్ధి పథకంలో నడిపించారు. వైడబ్ల్యూసిఎస్, టౌన్ బ్యాంకు, స్పిన్నింగ్ మిల్లు, వివర్స్ కాలనీ వంటివి స్థాపించిన వ్యక్తి మాచానీ సోమప్పను మర్చిపోవడం మాటకే సాధ్యం కాని పని అని తెలిపారు. దుబాయ్ లో కూడా ట్రాన్స్ పోర్ట్ నడిపిన వ్యక్తి సోమప్ప కు పద్మశ్రీ అవార్డు వచ్చిందని గుర్తు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డికు వివర్స్ కాలనీ మీద ఉన్న పట్టు, ఆదరణ ను చూసి ఓర్వలేక దూరం చేయాలనే దురుద్దేశంతోనే కుట్ర పన్నుతున్నారని టిడిపి నాయకులు మండిపడ్డారు. కోనేరు నాగేంద్ర ప్రసాద్ కులాల మధ్య చిచ్చు పెట్టడమే పనిగా పెట్టుకున్నాడని, టీడీపీకి చేనేతలను దూరం చేయాలనీ ఎన్ని ప్రయత్నాలు చేసిన సాధ్యం కానీ పని తెలిపారు. చేనేతలవైపు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి అండగా ఉన్నారని స్పష్టం చేశారు. విభేదాలు సృష్టించడమే కోనేరు పనిగా పెట్టుకున్నారని, ప్రజలు కోనేరు లాంటి తప్పుడు ప్రచారాలు నమ్మవద్దు అని కోరారు. జాతీయ జెండా ఎక్కడైనా నడిబొడ్డున పెడుతారని, హైదరాబాద్ లో గోల్కొండలో పెడితే గోల్కొండ ప్రాధాన్యత తగ్గిందా అని ప్రశ్నించారు. ఎమ్మిగనూరుని అభివృద్ధి చేసిన ఘనత మా చని సోమప్ప కే దక్కిందని తెలిపారు. ఆ తరువాత బీవీ మోహన్ రెడ్డి అని గుర్తు చేశారు. జాతీయ జెండా పెడితే మాత్రాన సోమప్ప సర్కిల్ పేరు కనుమరుగ కావడం సాధ్యం కాని పని అని తెలిపారు. కేవలం కొందరూ పని గట్టుకొని దుష్ప్రచారం చేస్తూ గిట్టని వారు అసత్య ప్రచారాలు చేస్తున్నారని వారి ప్రచారాలను పట్టణ ప్రజలు ఎవరు నమ్మవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ చేనేత నాయకులు పాల్గొన్నారు.

# మృత దేహాన్ని బంధువులకు అప్పగింత





మంత్రాలయం, జూలై 24,(శ్రీచక్ర) :మంత్రాలయం తుంగభద్ర నదిలో లభ్యమైన గుర్తు తెలియని మహిళ మృత దేహంను గురువారం ఎస్సై శివాంజల్ బందులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై శివాంజల్ మాట్లాడుతూ, బుధవారం తుంగభద్ర నదిలో గుర్తు తెలియని మహిళ మృత దేహం లభ్యమైందని కేసు నమోదు చేయటం జరిగింది. అయితే మృత దేహం గురించి సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయడంతో మృత రాల బంధువులు వచ్చారని తెలిపారు. మృత రాలు కర్నాటక రాష్ట్రం, బెంగళూరులోని నందిని లేఔట్ పోస్టు, శ్రీ వెంకటేశ్వర నగర్ చెందిన మంగళమ్మగా గుర్తించి మృత రాల కుమారుడు రాఘవేంద్ర తో పాటు బందులకు అప్పగించడం జరిగిందన్నారు. గత రెండు నెలల క్రితం మృత రాల సొంత చెల్లెలు గంగమ్మ చనిపోవటంతో మనస్థాపానికి గురైన మంగళమ్మ మంగళవారం ఎవ్వరికీ తెలియకుండా ఇంటినుంచి బమటకు వచ్చిందని, ఆమె కనబడకుండా పోయినట్టు బెంగళూరులోని మహాలక్ష్మి పురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు మృతరాలి కుమారుడు, బంధువులు తెలిపినట్లు ఎస్సై తెలిపారు. వారు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృత దేహాన్ని మృత రాలి కుమారుడు రాఘవేంద్ర, బంధువులు చూసి గుర్తించిరన్నారు. అనంతరం మృత దేహాన్ని కి పోస్టు మార్టం నిర్వహించి బందులకు అప్పగించినట్లు ఎస్సై శివాంజల్ తెలిపారు

# కర్నాటక మాజీ సీఎం కు ఆరాధన ఆహ్వానం



మంత్రాలయం, జూలై 24,(శ్రీచక్ర) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి 354 వ సప్త ఆరాధన మహోత్సవాలకు కర్నాటక రాష్ట్రం మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్పకు శ్రీ మఠం సహయ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి గురువారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆగస్టు 8 నుంచి ప్రారంభం కానున్న శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలకు హాజరై స్వామి వారి కృప కటాక్షం పొందాలని కోరారు.

# పూర్తిగా అసంపూర్తిగా గుంతలు, గుంతలుగా ఏర్పడి పాడైపోయిన రోడ్డుకు మరమ్మత్తులు చేయించండి మహాప్రభు,



ఎమ్మిగనూరు, జూలై, 24 (శ్రీ చక్ర):– ఎమ్మిగనూరు పట్టణ కమిటీ రోడ్డు నుండి కమ్మలదిన్నె వరకు పూర్తిగా పాడైపోయి గుంతలు గుంతలుగా ఏర్పడిన రోడ్డును బాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. పూర్తిగా గుంతలు, గుంతలుగా ఏర్పడిన తారు రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయించాలని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దావీదు, జిల్లా కార్యదర్శులు గుమ్మల బాబు, కౌలన్న, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లప్ప డిమాండ్ చేశారు. గురువారం ఆర్ అండ్ బి డి ఈ నాగరాజుకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు వినతి పత్రం సమర్పించారు. కమిటీ రోడ్డు నుండి కమ్మలదిన్నె వరకు పూర్తిగా దెబ్బతిన్న గుంతలు గుంతలు గా ఏర్పడిన రోడ్డులో ప్రభుత్వ బడులకు గ్రామీణ ప్రాంతాల్లో విద్య బోధన చెప్పడానికి వెళ్లాలంటేనే స్కూటర్ల మీద ప్రతిరోజు స్కూల్లకు విద్యా బోధన చెప్పడానికి వెళ్లడానికి ఉపాధ్యాయులందరూ ప్రతిరోజు నరకయాతన అనుభవిస్తున్నామని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆర్ అండ్ బి డి ఈ నాగరాజుకు ప్రతిరోజు ఇబ్బందులు పడుతున్న నరకయాతన గురించి విన్నవించుకున్నారు. కాబట్టి ఆర్ అండ్ బి అధికారులు సమస్యను దృష్టిలో ఉంచుకొని పూర్తిగా పాడైపోయినా రోడ్డును కమిటీ దగ్గర నుండి కమ్మలుదిన్నె వరకు పూర్తిగా పాడైపోయిన రోడ్డుకు వెంటనే మరమ్మత్తులు చేయించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, జాలవడి, కమ్మలదిన్నె గ్రామీణ ప్రాంత ప్రజలు ఆర్ అండ్ బి అధికారులను కోరుతున్నారు.

# 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నాం

**ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలు మండలంలోని తోట చర్ల గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ప్రజలను కలిసి ఏడాదిలో చేసిన మంచి పనులు వివరించిన మంత్రి టి.జి భరత్**



జగ్గయ్యపేట, జూలై 24 (శ్రీచక్ర): రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పనే లక్ష్యంగా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలు మండలంలోని తోటచర్ల గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య తో కలిసి ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని ఇంటింటికీ తిరిగి ఏడాదిలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మహిళలతో మాట్లాడి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకున్నారు. ఇదే సమయంలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని అడిగారు. అనంతరం మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిపాలన సాగిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఈ కార్యక్రమం చేపట్టి.. ఏడాదిలో చేసిన మంచిని వివరిస్తున్నామన్నారు. ఏ ఇంటికి వెళ్లిన ప్రజలు సంతోషంగా స్వాగతం పలుకుతున్నారన్నారు. క్యాబినెట్ సమావేశం నిర్వహించి వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఆమోదం తెలుపుతున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు దాదాపు 10 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చామని చెప్పారు. ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నామన్నారు. ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య మాట్లాడుతూ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంత్రి టీజీ భరత్ తమ నియోజకవర్గానికి రావడం సంతోషంగా ఉందన్నారు. గ్రామస్తులు అందరూ సంక్షేమ పథకాలు అందాయని చెబుతున్నారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు.

# ఘనంగా శ్రీశ్రీశ్రీ రామలింగ చౌడేశ్వరీ దేవి జన్మతిథి వేడుకలు



చంద్రగిరి, జూలై 24(శ్రీచక్ర): తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, తిరుపతి రూరల్ మండలం,పుదిపట్ల గ్రామంలో దేవాంగ కుల దేవత శ్రీ చౌడేశ్వరీ దేవి జన్మ తిథి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి,బడి సుధా యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు వాసు ఆధ్వర్యంలో అభిషేకం,ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మ కుంకుమ అర్చన,లలిత సహస్ర నామ పారాయణం లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అతిథులకు ఆలయ మర్యాదలు అందజేసి,పండితులు వేద ఆశీర్వచనం అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు,అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన్నెం శ్రీకాంత్,మన్నెముద్దు శ్రీనివాసులు,బొప్పన మోహన మురళీ,బొప్పన తిలక్ బాబు,బుసం లక్ష్మినరసయ్య,చంద్రమౌళి,గుత్తి త్యాగరాజు,దొడ్డి మునికృష్ణయ్య,స్థానికులు,చుట్టు పక్కల గ్రామాలకు చెందిన దేవాంగులు సుమారు 1000 మందికి పైగా పాల్గొన్నారు. కార్యక్రమంను జయప్రదం కోసం సహాయ సహకారం అందచేసిన దాతలకు,పాల్గొన్న దేవాంగులకు ఆలయ కమిటీ ప్రతినిధులు ధన్యవాదములు తెలిపారు.

# స్థాయి సంఘ సభ్యుల ఎన్నికకు 7 నామినేషన్లు



కర్నూలు, జూలై 24(శ్రీచక్ర): కర్నూలు నగరపాలక సంస్థ స్థాయి సంఘ ఎన్నికకు చివరి రోజు గురువారం 7 మంది కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. నగరపాలక కార్యాలయంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణకు అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. కాగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. శుక్రవారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియ జరగనుంది. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, సినియర్ అసిస్టెంట్ జివిఎం శ్రీకాంత్ పాల్గొన్నారు.×నామినేషన్లు వేసిన అభ్యర్థులు1. ఇ.నారయణ రెడ్డి – 28వ వార్డు కార్పొరేటర్ 2. వై.వెంకటేశ్వర్లు – 34వ వార్డు కార్పొరేటర్ 3. సి.హెచ్. సాంబశివరావు – 39వ వార్డు కార్పొరేటర్, 4. కురుబ మునెమ్మ – 43వ వార్డు కార్పొరేటర్, 5. షేక్ అహ్మద్ – 50వ వార్డు కార్పొరేటర్, 6. దండు లక్ష్మికాంత రెడ్డి – 26వ వార్డు కార్పొరేటర్, 7. పి.షాషావలి – 1వ వార్డు కార్పొరేటర్.

# సిఐ రామాంజులకు ప్రశంస



మంత్రాలయం, జూలై 24,(శ్రీచక్ర) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయంలో చాకచక్యంగా విధులు నిర్వహిస్తున్న సిఐ రామాంజులకు గురువారం కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. విది నిర్వాహణలో భాగంగా శుక్రవారం రోజున శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం వెనక భాగంలోఉన్నతుంగభద్ర నదిలోకి మాధవరం గ్రామానికి చెందిన రచ్చుమర్రి కొప్పురప్ప తుంగభద్ర నదిలోదూకిఆత్మహత్య యత్నానికి పాల్పడగా సమాచారం తెలుసుకున్న సిఐ రామాంజులు రాష్ట్ర విపత్తు నిర్వహణ సిబ్బందిని అప్రమత్తం చేసి కొప్పురప్ప ప్రాణాలు కాపాడినందుకు, అలాగే మంత్రాలయంలో భక్తులకు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ అంతరాయం లేకుండా విధినిర్వహణను గుర్తించిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశం అనంతరం సిఐ రామాంజులకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

# తుంగభద్ర నదిలోకి ఎవ్వరూ వెళ్ళవద్దు -ఎస్సై శివాంజల్



మంత్రాలయం, జూలై 24,(శ్రీచక్ర) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయంలో ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలోకి భక్తులు, ప్రజలు ఎవ్వరూ వెళ్ళవద్దని మంత్రాలయం ఎస్సై శివాంజల్ సూచించారు. గురువారం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం వెనుక భాగంలో ఉన్న తుంగభద్ర నది ప్రవాహాన్ని ఆయన తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. తుంగభద్ర డ్యామ్ నుండి ఐదు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తుంది. తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నదిలోకి భక్తులను అనుమతించ వద్దని తమ సిబ్బందికి, శ్రీ మఠం సెక్యూరిటీ సిబ్బందికి ఆదేశించారు. అంతేకాకుండా శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో ఉన్న మైకుల ద్వారా భక్తులకు, గ్రామస్తులకు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితోపాటు శ్రీ మఠం సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు

# పోలీసుస్టేషన్ లలో సాంకేతికతను బాగా వినియోగించాలి

**నేర నియంత్రణకు గట్టిగా పని చేయాలి**
**డ్రగ్స్ వద్దు బ్రో కరపత్రాలను విడుదల**
**మాదకద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట వేయాలి**
**కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**






కర్నూలు, జూలై 24 (శ్రీచక్ర): శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు సీరియస్ గా పని చేస్తనే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం ఉండదని కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ లు తెలిపారు. ఈ సంధర్బంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైల తో అర్థ వార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించి పోలీసు అధికారులతో మాట్లాడారు. కర్నూలు రేంజ్ డిఐజి మాట్లాడుతూ జిల్లాల విభజన తర్వాత కర్నూలు రేంజ్ లో కర్నూలు జిల్లాలో ప్రశాంతమైన వాతావరణం ఉందన్నారు. పాత కక్షలు లేకుండా అందరికి కౌన్సిలింగ్ చేయాలన్నారు.ఎక్కడైనా అల్లర్లు జరగకుండా, ఓపెన్ డ్రింకింగ్ వంటివి లేకుండా డ్రోన్ కెమెరాలతో నిఘాతో విజిబుల్ పోలీసింగ్ కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పోలీసు అంటనే భద్రత అనే విధంగా పోలీసుస్టేషన్ లు బాగా పని చేయాలన్నారు. పోలీసుస్టేషన్ లలో భాదితులకు న్యాయం జరిగితే పోలీసు ఉన్నతాధికారులను బాధితులు ఆశ్రయించే అవకాశం ఉండదన్నారు. న్యాయం జరగక పోతేనే పోలీసు ఉన్నతాధికారులను భాదితులు ఆశ్రయిస్తారన్నారు. సాంకేతిక నైపుణ్యం బాగా పెంచుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. పోలీసుస్టేషన్ లలో సాంకేతికతను వినియోగించి నేరాల కట్టడికి గట్టిగా పని చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ల లలో, పరిధిలలో సిసి కెమెరాలు బాగా పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్లో పరిధిలలో నేర నివారణకు ముందస్తు జాగ్రత్తల చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట పిడి యాక్టులు, బైండోవర్లు, రౌడిషీటర్లకు కౌన్సిలింగ్ చేయాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ , ఓపెన్ డ్రింకింగ్, యాంటీ ఈవ్ టీజింగ్ తనిఖీలను డ్రోన్ కెమెరాలతో ఇంకా బాగా చేయాలన్నారు. ప్రాపర్టీ కేసులలో రికవరీలు చేయాలన్నారు. ప్రాపర్టీ కేసులలో నిందితుల వేలి ముద్రల ను సేకరించి చేధించాలన్నారు. కోర్టులో ఉన్న పెండింగ్ కేసులను త్వరగా ట్రయల్ కు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. భాదితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోక్సో కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. సిసి టిఎన్ ఎస్ లో ఫైల్స్ అప్ లోడ్ , ఈ ? సమన్స్, ఈ సాక్ష్యా యాప్ ల వంటి టెక్నాలజిని బాగా ఉపయోగించాలన్నారు. అనంతరం గత నెలలో వివిధ కేసులలో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులు, పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లాలో గత ఆరు నెలలుగా చోటు చేసుకున్న నేరాల విశ్లేషణ, దర్యాప్తు పురోగతి, నేరాల నివారణకు తీసుకున్న చర్యలపై సమగ్ర సమీక్ష చేపట్టారు.గత 6 నెలల కాలంలో నమోదైన క్రైమ్ గణాంకాల విశ్లేషణ జరిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది యొక్క పనితీరు సంతృప్తికరంగా ఉందని, ఇదే పనితీరు మునుముందు కొనసాగిస్తూ అందరి సమిష్టి కృషితో బాధితులకు న్యాయం చేసే దిశగా ముందడుగు వేయాలన్నారు. ఈగల్ టీం ఆధ్వర్యంలో గంజాయి కి, డ్రగ్స్ కి గుడ్ బై చెబుదాం , డ్రగ్స్ వద్దు బ్రో , మాదకద్రవ్యాల వినియోగాన్ని కట్టడి చేయాలనే కరపత్రాలను కర్నూల్ రేంజ్ డీఐజీ, జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. జిల్లాలో గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రజలు అటువంటి సమాచారంను టోల్ ఫ్రీ నెంబర్ 1972 కి సమాచారం అందించాలని తెలియజేశారు.ఈ నేర సమీక్షా సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డిఎస్పీలు బాబు ప్రసాద్, వెంకట్రామయ్య, శ్రీనివాసాచారి, ఉపేంద్రబాబు, హేమలత , ఏ ఆర్ డి ఎస్ పి భాస్కర్ రావు , సిఐలు , ఎస్సైలు, ఈగల్ టీం ఎస్సై సుజన్ కుమార్, ఈగల్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

# బంగారు కుటుంబాల అర్హతలను పునః పరిశీలించాలి

**మార్గదర్శకులను త్వరితగతిన అన్వేషించాలి**
**నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశం**





కర్నూలు, జూలై 24 (శ్రీచక్ర): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్షిప్ (పీ4) పథకం కింద బంగారు కుటుంబాల అర్హతలను పునః పరిశీలించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మార్గదర్శకులను కూడా త్వరితగతిన అన్వేషించాలని కమిషనర్ సూచించారు. గురువారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో అడ్మిన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పీ4 పథకం కింద 10,600 బంగారు కుటుంబాలను గుర్తించామని, ఈ నెలాఖరులోగా వారి అర్హతలను మరోమారు పక్కాగా పరిశీలించాలని సూచించారు. 629 మంది మార్గదర్శకులను ఇప్పటికే ఎంపిక చేశామని, వారికి 3,709 మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు అనుసంధానం చేశామన్నారు. మిగిలిన బంగారు కుటుంబాలను ఆగస్టు 15 లోపు దత్తత తీసుకునేలా మార్గదర్శకులను అన్వేషించాలని తెలిపారు. సచివాలయంలో ఉన్న ప్రతి కార్యదర్శి ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అదేవిధంగా ఆస్తి పన్ను, కొళాయి, ట్రేడ్ లైసెన్స్ రుసుముల వసూళ్లపై దృష్టి సారించాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, సూపరింటెండెంట్ మంజూర్ బాబు, స్పెషల్ ఆఫీసర్ సుహైల్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ మరమ్మత్తు పనులు

**నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**





కర్నూలు, జూలై 24 (శ్రీచక్ర): సంతోష్ నగర్ వద్ద జాతీయ రహదారిపై ప్రధాన తాగునీటి పైప్‌లైన్ లీకేజీ మరమ్మత్తు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టినట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ వెల్లడించారు. గురువారం ఆయన మరమ్మత్తు పనులను పరిశీలించారు. ప్రజలకు తాగునీటి సరఫరాకు తిరిగి ప్రారంభించేందుకు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఒక పైపునకు మరమ్మత్తులు పూర్తి అయ్యాయని, మరో పైపునకు మరమ్మత్తు పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, డిఈఈలు గిరిరాజ్, మనోహర్ రెడ్డి, ఏఈలు జనార్ధన్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. గురువారం ఆయన ఖడక్‌పుర, వడ్డేగిరి ప్రాంతాల్లో పర్యటించారు. మురుగునీరు సక్రమంగా ప్రవహించేందుకు డ్రైనేజీ కాలువలపై ఆక్రమణలు తొలగించి అవసరమైన నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని కమిషనర్ ఆదేశించారు. అదేవిధంగా సుంకేసుల రహదారిని రూ.90 లక్షల ఎన్‌క్యాప్ నిధులతో చేపట్టిన విస్తరణ పనులను పరిశీలించారు. గాంధీ టవర్స్ వద్ద డ్రైనేజీ కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, తనిఖీదారులు జిలానీ, ముర్తుజ వలి, ట్రైనీ ఏఈ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# గడియారం ఆసుపత్రి వద్ద ఆక్రమణలు తొలగింపు



కర్నూలు, జూలై 24(శ్రీచక్ర): పాతబస్తీలోని గడియారం ఆసుపత్రి వద్ద రహదారిపై ఆక్రమించి ఉన్న 15 షాపులను గురువారం నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తొలగించారు. ట్రాఫిక్‌కి ఇబ్బంది కలిగించే ఆక్రమణలను తొలగిస్తున్నట్లు సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, బిల్డింగ్ సూపర్వైజర్ మధుగోపాల్, ప్లానింగ్ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి ఆదర్శ్ గ్రామ యోజన (పిఎమ్ఎజివై) పథకం కింద మంజూరు అయ్యే నిధులను గ్రామాల అభివృద్ధికి వినియోగించండిజిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు,స్వాతి కిరణం ప్రతినిధి జూలై 24:– ప్రధాన మంత్రి ఆదర్శ్ గ్రామ యోజన (పిఎమ్ఎజివై) పథకం మంజూరు అయ్యే నిధులను గ్రామాల అభివృద్ధికి వినియోగించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.. గురువారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ప్రధాన మంత్రి ఆదర్శ్ గ్రామ యోజన (పిఎమ్ఎజివై) పథకం అమలు పై సంబంధిత అధికారులతో కన్వర్జెన్స్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు..ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆదర్శ్ గ్రామ యోజన (పిఎమ్ఎజివై) పథకం కింద దళిత జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలను అభివృద్ధి చేయడం లక్ష్యం అన్నారు.. మొదటి విడతలో ఈ పథకం ద్వారా మూడు ఎంపిక చేసి అభివృద్ధి చేయడం జరిగిందన్నారు.. ఓర్వకల్లు మండలంలోని బొడ్డువానిపల్లె గ్రామం, ఆదోని మండలంలోని నారనపురం గ్రామ పంచాయతీ, చాగి గ్రామం, ఎమ్మిగనూరు మండలంలోని ఎనిగబాల గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని, పనులు పూర్తి చేసిన వాటికి రెండు రోజుల్లోపు యుటిలైజేషన్ సర్టిఫికెట్ ను సమర్పించాలని కలెక్టర్ సాంఘిక సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.. ఈ పథకం కింద ఫేజ్ 2 లో 9 గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.హోళగుంద మండలం మార్లమాడికి, కర్నూలు మండలం పసుపుల గ్రామ పంచాయతీ లోని నూతనపల్లె, పెద్దకడబూరు మండలం మ్యకదోన, ఆస్పరి మండలం నగరూర్, ఓర్వకల్లు మండలంలోని ఉప్పలపాడు, మంత్రాలయం మండలంలోని బూదూర్, గూడూరు మండలంలోని గుడిపాడు, గూడూరు మండలంలోని కే.నాగలాపురం గ్రామపంచాయతీ, కురువ నాగలాపురం గ్రామం, నందవరం మండలం మాచపురం గ్రామాలను ఎంపిక చేసి, ఈ గ్రామాల్లో ప్రతిపాదించిన అభివృద్ధి పనులను చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. పాఠశాలల్లో, అంగన్వాడి సెంటర్లలో మరమ్మతుల పనులు, త్రాగునీటికి సంబంధించి ఫిల్టర్ బెడ్ సమస్యలు, పంచాయతీరాజ్ కి సంబంధించి అప్రోచ్ రోడ్లు, ఆర్ అండ్ బి రోడ్లు, మౌలిక సదుపాయాలు తదితర పనులను ఈ నిధులతో చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు...ఏదైనా పథకానికి సంబంధించి గ్యాప్ ఉన్నట్లయితే, ప్రధాన మంత్రి ఆదర్శ్ గ్రామ యోజన (పిఎమ్ఎజివై) నిధులు వినియోగించుకుని, ఆ గ్యాప్ ను పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..సమావేశములో జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి,సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాధిక, జల వనరుల శాఖ ఎస్ ఈ బాలచంద్రా రెడ్డి,ఐసిడిఎస్ పిడి నిర్మల, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వర రావు, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఉమాపతి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.భాస్కర్ రాజు తదితరులు పాల్గొన్నారు..





## ఈ క్రాప్ నమోదు కోసం వ్యవసాయశాఖలో సిబ్బంది కొరత తీర్చండి.

## టీడీపీ అధ్యక్షుడు పిన్నమరెడ్డి యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏవో గౌరీకి విన్నవించిన రైతులు.



వరదయ్యపాలెం,జూలై 24(శ్రీచక్ర):వ్యవసాయశాఖలో ఖాళీగా ఉన్న సిబ్బంది కొరతను భర్తీ చేసి ఈ క్రాప్ నమోదును చేపట్టాలని టీడీపీ మండల అధ్యక్షుడు పిన్నమరెడ్డి యుగంధర్ రెడ్డి సీఎల్ ఎన్ పల్లి మాజీ సర్పంచ్ రవిరెడ్డి ఆధ్వర్యంలో రైతులు ఏవో గౌరీకి విన్నవించారు.ఈ సందర్భంగా యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ సిబ్బంది కొరత వల్ల ఈ క్రాప్ నమోదు చేయలేని పరిస్తితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ క్రాప్ నమోదు చేసుకోవడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని దీనివల్ల రైతులు అదనంగా బస్తాకు రూ. 300 వరకు ఆదాయం వస్తుందని అన్నారు. ఈ క్రాప్ నమోదు చేసుకొని పక్షంలో రైతులకు గిట్టుబాటు ధర లభించక రైతులు నష్టపోతారని అన్నారు.కావున ఈ క్రాప్ నమోదు చేయడానికి సిబ్బందిని భర్తీ చేయాలని ఏవో గౌరీకి విన్నవించారుదీనిపై ఏవో గౌరీ ఈ విషయాన్ని సత్యవేడు ఏడి,జిల్లా పీడీ కి ఫోన్ లో వారి దృష్టికి తీసుకురాగా..త్వరలోనే భర్తీ చేస్తామని వారు హామీ ఇచ్చారు

## ఘనంగా శ్రీశ్రీశ్రీ రామలింగ చౌడేశ్వరీ దేవి జన్మతిథి వేడుకలు.

చంద్రగిరి, జూలై 24(శ్రీచక్ర): తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, తిరుపతి రూరల్ మండలం,పుదిపట్ల గ్రామంలో దేవాంగ కుల దేవత శ్రీ చౌడేశ్వరీ దేవి జన్మ తిథి వేడుకలు ఘనంగా నిర్వహించారు.తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి,బిడి సుధా యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు వాసు ఆధ్వర్యంలో అభిషేకం,ప్రత్యేక పూజలు నిర్వహించారు.లక్ష్మ కుంకుమ అర్చన,లలిత సహస్ర నామ పారాయణం లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అతిథులకు ఆలయ మర్యాదలు అందజేసి,పండితులు వేద ఆశీర్వచనం అందించారు.సాంస్కృతిక కార్యక్రమాలు,అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మన్నెం శ్రీకాంత్,మన్నెముద్దు శ్రీనివాసులు,బొప్పన మోహన మురళీ,బొప్పన తిలక్ బాబు,బుసం లక్ష్మినరసయ్య,చంద్రమౌళి,గుత్తి త్యాగరాజు,దొడ్డి మునికృష్ణయ్య,స్థానికులు, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన దేవాంగులు సుమారు 1000 మందికి పైగా పాల్గొన్నారు.కార్యక్రమంను జయప్రదం కోసం సహాయ సహకారం అందచేసిన దాతలకు,పాల్గొన్న దేవాంగులకు ఆలయ కమిటీ ప్రతినిధులు ధన్యవాదములు తెలిపారు.

## ఎప్పటికప్పుడు మాక్ డ్రింక్ నిర్వహించండి : ఆర్డీవో దేవరకొండ అఖిల





రామచంద్రపురం, జూలై 24( శ్రీచక్ర) రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న ప్రమాదకర పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆర్డీవో దేవరకొండ అఖిల పరిశ్రమల యాజమాన్యాల సంబంధిత అధికారులకు సూచించారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో గురువారం సాయంత్రం సంక్షోభ నివారణ కమిటీ లోకల్ క్రైసిస్ గ్రూప్ సమావేశం ఆర్డిఓ దేవరకొండ అఖిల అధ్యక్షతన జరిగింది. ఈ మీటింగ్ ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ పరిశ్రమల సమీపాన ఉంటున్న ప్రజలకు ఆయా పరిశ్రమలల్లో సంభవించే ప్రమాదాలపై పూర్తి అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (కాకినాడ) కే. రాంబాబు మాట్లాడుతూ ప్రమాదకర కర్మాగారాలలో తీసుకోవల్సిన భద్రతా ప్రమాణాలు, ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఎం.పి.డి. ఓ లు, అగ్నిమాపక అధికారులు, మెడికల్ సిబ్బంది, పంచాయతీ రాజ్ సిబ్బంది, ఇతర కమిటీ సభ్యులు, డివిజన్ పరిధిలో పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

## జిల్లా సహకార శాఖ ఉద్యోగులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు.

భీమవరం జూలై 24( శ్రీచక్ర) కమిషనర్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఆదేశముల మేరకు పశ్చిమగోదావరి జిల్లా సహకార అధికారి ఎస్. మురళీకృష్ణ ఆధ్వర్యంలో డిసిసిబి మెయిన్ బ్రాంచ్ భీమవరం నందు పశ్చిమగోదావరి జిల్లా సహకార శాఖ ఉద్యోగులకు సమాచార హక్కు చట్టం, 2005 గురించి ఉద్యోగులందరికీ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది, ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం క్రింద దరఖాస్తులుఎలా రిసీవ్ చేసుకోవాలి, సమాచారాన్ని ఎలా ఇవ్వాలి, సమాచారం ఇచ్చుటకు గల పరిమితులు మొదలగు అంశముల గురించి పూర్తిగా వివరించడం జరిగినది .ఈ కార్యక్రమమునకు భీమవరం, నరసాపురం, తణుకు, మరియు తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ లకు సంబంధించిన ఉద్యోగులందరూ హాజరైనారు.




## శాకాంబరీ దేవిగా శ్రీమహలక్ష్మి అమ్మ వారు.హాసన్ బాద్ లో ఆషాడం సారె సమర్పణ







రామచంద్రపురం, జూలై 24(శ్రీచక్ర) రామచంద్రపురం మండలం హసన్ బాద గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మహాలక్ష్మీ అమ్మవారిని శాకంబరిగా అలంకరణ చేశారు.ఈ సందర్భంగా గ్రామ మహిళలు పసుపు కుంకుమ,పండ్లు స్వీట్స్, పువ్వులు మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి ఆషాఢం సారెను సమర్పించారు.ఉండి వీరభద్ర శర్మ బ్రాహ్మత్వంలో మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమార్చన,లలితా స్తోత్ర పారాయణం చేసి మంత్ర పుష్పం తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు,చేనేత శ్రామిక నాయకులు దొంతంశెట్టి సత్య ప్రకాష్, విద్యా కమిటీ ఛైర్మన్ జాన మళ్ళిబాబు,వార్డ్ సభ్యులు గొల్ల పల్లప పద్మరాజు,బట్ట శ్రీనివాసరావు,త్రిమూర్తులు, కాలేపు గంగయ్య,కాలేవు ఓం నమఃశివాయ,కాలేవు వీర వెంకట సుబ్రహ్మణ్యం, బట్టా సూర్యనారాయణ,ఆంద్ర సాంబశివరావు,బత్తుల శ్రీను యర్రా కోటేశ్వర రావు గ్రామస్థులు,అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మావుళ్లమ్మ అమ్మవారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి





భీమవరం జూలై 24 (శ్రీ చక్ర ) జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కుటుంబ సభ్యులతో కలిసి గురువారం శ్రీ మావుళ్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. జిల్లా కలెక్టర్ కు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణకుంభం, మంగళ వాయిద్యాలు తో స్వాగతం పలికారు. ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లిఖార్జున శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, కలెక్టర్ కు ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆశీర్వచన మండపం నందు జిల్లా కలెక్టర్ నువేద పండితులు మంత్రోచ్ఛారణలతో ఆశీర్వదించారు., ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను జిల్లా కలెక్టర్ కు అందజేశారు.ఈ సందర్భంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ హరి ప్రకాష్, భీమేశ్వర స్వామి ఆలయం ఈవో రామకృష్ణంరాజు, వివిధ దేవాలయాల ఈవోలు, ఆలయ అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడ ?

**ప్రజలకు అందని పథకాలను గూర్చి మాట్లాడకూడదా**

**రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి పాదర్తి రాధాకృష్ణారెడ్డి**

**రాజకీయాలు మాని అభివృద్ధిని చేసి చూపించండి**

**వైసీపీ మండల కన్వీనర్ పలగాటి.సంపత్ కుమార్ రెడ్డి**

**విమర్శలను స్వీకరించాలే కానీ తప్పుగా భావించకూడదు**

**మాజీ జెడ్పిటిసి ఉప్పల ప్రసాద్ గౌడ్**

**ఎమ్మెల్సీ మేరీగా మురళీధర్ పై ఆరోపణలను మానుకోండి**

**వైసిపి మండల జాయింట్ సెక్రటరీ పామల సురేంద్ర**



కోట జూలై 24 (శ్రీచక్ర): కోట మండలంలో విద్యానగర్ నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్ లో ఇటీవలన బాబు షూరిటీ మోసం గ్యారెంటీ పేరుతో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.అయితే ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ మేరీగ మురళీధర్ పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీ మేరీగ.మురళీధర్, తదితర వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనుల జరగడం లేదని మాట్లాడడం జరిగింది.దీనిపై టిడిపి నాయకులు స్పందించి వైసీపీ నాయకులపై విరుచుకుపడ్డ విషయం తెలిసిందే.మరలా విద్యానగర్లోని స్థానిక నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్ లో మండల వైసీపీ కన్వీనర్ పలగాటి. సంపత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి పాదర్తి. రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలు అని ప్రజలను మోసం చేసుకుంటూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆరోపించారు.అదేవిధంగా ఎమ్మెల్సీ మేరీగ.మురళీధర్ సంక్షేమ పథకాలు సక్రమంగా ప్రజలకు అందడం లేదని మాట్లాడకూడదా,దాన్ని కూడా తప్పుగా చిత్రీకరించడం సరికాదన్నారు.పేరుకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నారు తప్ప అకౌంట్లో నగదు జమ కావడం లేదని, రైతు భరోసా,తల్లికి వందనం,ఆడబిడ్డ నిధి,ఉచిత బస్సు,తదితర లాంటి పథకాలను తుంగలో తొక్కేయడం ఏమిటని ప్రశ్నించారు.గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి పంచాయతీలో కోటి రూపాయలు ఖర్చును కేటాయించి సచివాలయం,రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్లను నిర్మించడం జరిగిందన్నారు. అంతేకాకుండా 16 మెడికల్ కళాశాలలను నిర్మిస్తే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాటిని అమ్ముకుంటున్నారని ఎద్దేవా చేశారు.ప్రతిపక్ష పార్టీలో ఉండి ప్రజలకు అన్యాయం జరిగితే ప్రజల పక్షాన మాట్లాడడం తప్పు పట్టడం ఏమిటన్నారు.అనంతరం మండల కన్వీనర్ పలగాటి.సంపత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి జరిగిందని గొప్పలు చెప్పుకోవడం సరికాదని కోట మండల పరిసర గ్రామాల్లో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని వాపోయారు. అభివృద్ధి కార్యక్రమాలను చేసి చూపించాలే కానీ లేనిపోని రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు. అదేవిధంగా మాజీ జెడ్పిటిసి ఉప్పల. ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ మేరీగ.మురళీధర్ నైతికంగా విలువలు కలిగిన వ్యక్తి అని గుర్తు చేస్తూ విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్,నిరుద్యోగులకు ఉపాధి,పింఛన్లు,తదితర లాంటి హామీలను ఇప్పటికీ సక్రమంగా నెరవేర్చలేదన్నారు.పింఛన్లు అందజేసే కార్యక్రమంలో మరెన్నో ఆంక్షలు పెట్టి పేర్లను తొలగించారు అని తెలిపారు. విమర్శలను సేకరించాలే తప్ప వాటిని తప్పు పట్టడం సరికాద న్నారు.అనంతరం వైసిపి మండల జాయింట్ సెక్రెటరీ పామల. సురేంద్ర మాట్లాడుతూ పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందడం లేదని విలేకరుల సమావేశంలో మేరిగ. మురళిధర్ మాట్లాడితే అలాంటి వ్యక్తిపై ఆరోపణలు చేయడం తగదని,గత ఎన్నో సంవత్సరాల నుండి వైసీపీ ప్రభుత్వాన్ని నమ్ముకుని హోందాగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని నమ్ముకుని పార్టీ బలోపేతనానికి కృషి చేస్తున్నాడని తెలిపారు .అలాంటి మేరీగ.మురళి ధరపై టీడీపీ దళిత నాయకులు మాట్లాడడం ఏమిటని ప్రశ్నించారు.ప్రతి గ్రామంలో విద్యార్థులు బాగా చదువుకోవాలనే ఉద్దేశంతో గత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాడు నేడు స్కూల్ లను నిర్మించడం చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ప్రతిపక్ష పార్టీలో ఉంటూ ఇలాంటివి చెప్తున్నపుడు అధికారి పార్టీ వారు అమల్లోకి తీసుకోవాలే గాని లేనిపోని రాజకీయాలు ఉండకూడదన్నారు. ప్రస్తుతం ఒక సంవత్సరంలో పరిపాలన విధానం దారుణంగా ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులను భయపెట్టడం మానుకుని అభివృద్ధి వైపు పయనించాలన్నారు.గత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వాలెంటీర్ల వ్యవస్థను తీసుకురావడమే కాకుండా మరెంతో మందికి సచివాలయ ఉద్యోగ ఉపాధిని చూపించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ పలగాటి.సంపత్ కుమార్ రెడ్డి,రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి,జడ్పిటిసి దాసరి కోటయ్య,మాజీ జెడ్పిటిసి ఉప్పల ప్రసాద్ గౌడ్,మండల జాయింట్ సెక్రెటరీ పాముల సురేంద్ర,దేవారెడ్డి నాగూర్ రెడ్డి, పల్లెమల్లు.విజయ సారధి రెడ్డి,సుబ్రహ్మణ్యం రెడ్డి,తన్నమాల కోటారెడ్డి, నాగూర్ యాదవ్, ముంగమూరు సుబ్రహ్మణ్యం,మహిళా నాయకురాలు సుధారెడ్డి,గంపా. కోటేశ్వం రావు,తూపిలి నాగరాజు, వాటంభేటీ .సుబ్రహ్మణ్యం, పుచ్చకాయల. వెంకట కృష్ణయ్య,మేకల గోపాలయ్య,ముని కుమార్,తదితర వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం పై తాడేరు రైతులకు అవగాహన సదస్సు.



భీమవరం జూన్ 24. శ్రీ చక్ర ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం గురించి తాడేరు సొసైటీ కార్యాలయంలో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఏఐసీ)అనే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వల సహకారం తో ఈ ప్రాజెక్ట్ అమలు చేస్తున్నట్లు సహకార శాఖ అధికారులు తెలిపారు.రాష్ట్రం లోని పశ్చిమ గోదావరి,విజయనగరం,శ్రీ సత్యసాయి జిల్లాలలో మాత్రమే పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.ఈ ఫథకం రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వచ్చే ఆగస్ట్ 15 వ తేదీ లోపు ఒక ఎకరానికి 210 రూపాయలు చొప్పున రైతులు చెల్లించి పంటల భీమా చేయించు కోవాలని సూచించారు.కౌలు రైతులు,ఋణాలు తీసుకో ని రైతులకు కూడా ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో తాడేరు,బేతపూడి గ్రామ రైతులు,సొసైటీ సి ఈ ఓ నందమూరి సుబ్బారావు, ఫీల్డ్ కోఆర్డినేటర్ హాశ్వంత్ రైతులకు సూచనలు చేసారు.

## జిల్లాలో సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై కలెక్టర్ ఆదేశాలు

**మరమ్మత్తుల పనులు నాణ్యతతో, వేగంగా పూర్తిచేయాలి: వెంకటేశ్వర్**

తిరుపతి, జూలై 24 (శ్రీచక్ర):జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు పెండింగ్లో ఉన్న మరమ్మత్తుల పనులను నాణ్యతతో పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖలతో పాటు గురుకుల పాఠశాలల అధికారులు, ఇంజినీరింగ్ శాఖాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని, విద్యార్థుల బాగోగులకు అనువైన వాతావరణం కల్పించేందుకు అవసరమైన మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని సూచించారు. పెండింగ్లో ఉన్న మరమ్మత్తుల పనులు నిర్ణీత గడువులోపు పూర్తి చేసి, నాసిరకం మెటీరియల్ వాడరాదని స్పష్టం చేశారు.చేపట్టాల్సిన ముఖ్య అంశాలు:మరుగుదొడ్ల మరమ్మత్తులు, రన్నింగ్ వాటర్ సరఫరా, ప్రతి కొళాయికి ట్యాప్ ఏర్పాటు, ట్యూబ్ లైట్లు, ఎలక్ట్రికల్ వైరింగ్, ఎల్ఈడి బల్బులు, వంటగదికి ఎగ్జాస్ట్ ఫ్యాన్, స్టోర్కు మెష్, కిటికీలకు దోమల మెష్, తలుపులు, లీకేజీ రహిత గదులు, ఫ్లోరింగ్, త్రాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్లుపనులకు ఇప్పటికే నిధులు మంజూరైనందున వాటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించాలన్నారు. అదనంగా అవసరమైన నిధులు సిఎస్ఆర్, ఎంపీ లాడ్స్, డిఎంఎఫ్ వంటి మార్గాల ద్వారా సమీకరించి మరమ్మత్తులు వేగవంతం చేయాలని సూచించారు.ఇంజినీరింగ్ అధికారులు పనుల బిల్లులు అప్లోడ్ చేసి వెంటనే పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. పనుల పురోగతిని క్రమం తప్పకుండా పర్యవేక్షించాల్సిందిగా ఆదేశించారు. జాప్యానికి చోటులేదని, అలా జరిగితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు విక్రం కుమార్ రెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, రాజాసోము, రేష్మ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పటికీ వైకాపా దే పెత్తనం

నూజివీడు ,దత్తత గ్రామం ముక్కొళ్ళుపాడు లో మాజీ ఐయేఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు పర్యటించారు. గ్రామంలో వైసీపీ గుండాలు చేస్తున్న అరాచకాలపై ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ వైసిపి గుండాలు చేస్తున్న అరాచకాలను అరికట్టలేరా అని నిలదీసారు. ముక్కొళ్ళుపాడు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా డ్వాక్రా మహిళా సంఘాల బుక్ కీపర్ ను తొలగించేందుకు గ్రామ ఉపసర్పంచ్ కలగర శివసాయి ప్రయత్నించాడని ఆరోపించారు. టిడిపి కార్యకర్తలు, నాయకులు, మహిళలపై దాడులకు తెగపడుతున్న శివ సాయిపై నూజివీడు రూరల్, పట్టణ పోలీస్ స్టేషన్ లలో ఫిర్యాదు చేసినప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోలేదు. గత ప్రభుత్వంలో అడ్డగోలుగా సంపాదించిన డబ్బుతో మదమెక్కి గ్రామంలో రాజకీయాలు చేస్తున్నారు. బుక్ కీపర్ పదవికి రాజీనామా చేయకపోతే పద్మ అనే మహిళను చంపేస్తామని బెదిరించడంతోపాటు దాడిచేసి చెయ్యి విరగొట్టారు. డ్వాక్రా మహిళా సంఘాలను ఆటో ఎక్కించుకున్నాడన్న కారణంగా ఆటో డ్రైవర్ పై దాడి చేస్తే, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.

# ఎమ్మెల్యేలు చెప్పింది వినాలి వీరమల్లు

కాకినాడ, జూలై 24, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కోసం ఇరవై మంది ఎమ్మెల్యేలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారా? అంటే అవుననే అంటున్నారు. జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల్లో ఆ పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యేలే ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కూడా సహకరించడం లేదు. టీడీపీ నేతలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రోటోకాల్ పాటించకుండానే కొందరు అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో జనసేన ఎమ్మెల్యేలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినా ఆయన పట్టించుకోవడం లేదని కొందరు అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ కలసి కూర్చుని మాట్లాడితేనే ఈ సమస్యకు తెరపడుతుందని భావిస్తున్నారు. గత ఎన్నికల్లో జనసేన పార్టీ 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజయం సాధించింది. పవన్ కళ్యాణ్ విజయం సాధించిన పిఠాపురం నియోజకవర్గం మినహాయించి మిగిలిన ఇరవై జిల్లాల్లో కూటమి పార్టీలోని నేతలు జనసేన ఎమ్మెల్యేలకు సహకరించడం లేదు. పిఠాపురం నియోజకవర్గంలోనూ మాజీ ఎమ్మెల్యే వర్మ తన వర్గాన్ని ప్రత్యేకంగా చూస్తున్నారు. అక్కడ కూడా జనసేన, టీడీపీకి పడటం లేదు. పిఠాపురం నియోజకవర్గంలోనే ఈ పరిస్థితి ఉంటే ఇక మిగిలిన నియోజకవర్గాల్లో పరిస్థితి ఎలా ఉంటుందన్నది ఆలోచించాలని కోరుతున్నారు. నాగబాబుతో పాటు ఇతర నేతలు అక్కడకు వెళ్లినప్పుడు టీడీపీ కార్యకర్తలు చేసే నినాదాలు ఎలా ఉంటాయో వేరే చెప్పాల్సిన పనిలేదు. ఇక తాజాగా తాడేపల్లిగూడెం జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు కూడా ఇందుకు అద్దం పడుతున్నాయి. వివాదాల విషయంలో మాట్లాడాలి అంటే తాను డైరెక్ట్ గానే మాట్లాడతానని, అసలు ఇరవై ఒక్క జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం నియోజకవర్గంలో ఏం జరుగుతుందో తెలుసా? అని బొలిశెట్టి శ్రీనివాస్ చేసిన కామెంట్స్ మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయాన్ని తాకాయి. అందర్నీ ఒకచోట కూర్చోబెట్టి చర్చ పెడితే డి అప్పుడు తెలుస్తుంది తమ బాధ ఏంటో అని ఆయన అన్నారు. కలసి ఉంటే అందరికీ మంచిదని, లేదంటే.. వచ్చే ఐదేళ్లు అందరూ అడుక్కోవాల్సి వస్తుందని కూడా బొలిశెట్టి శ్రీనివాస్ చేసిన హెచ్చరికలు పరిస్థితికి అద్దం పడుతున్నాయి. కూటమి ధర్మం ప్రకారం అన్ని పార్టీలకు సమాన హక్కులు ఉండాలని కోరారు. మరొక వైపు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాత్రం ఆగస్టు నెల నుంచి పార్టీ పటిష్టతపై దృష్టి పెడతానని తెలిపారు. పవన్ కళ్యాణ్ మాత్రం కూటమిలోని మూడు పార్టీలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. అయితే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు సమన్వయంతో పనిచేస్తే సరిపోదని, కింది స్థాయిలో సమన్వయం ఉండాలని జనసేన ఎమ్మెల్యేలు కోరుతున్నారు. నియోజకవర్గాల్లో తమ పరిస్థితిని తెలుసుకుంటే పవన్ కళ్యాణ్ అలా మాట్లాడరని అంటున్నారు. మొత్తం మీద త్వరలోనే జనసేన ఎమ్మెల్యేలు పవన్ కళ్యాణ్ కు తమ పరిస్థితులు వివరించి కూటమిలో పార్టీల సమన్వయానికి కృషి చేయాలని కోరేందుకు సిద్ధమయినట్లు సమాచారం. ఎమ్మెల్సీ నాగబాబుకు మంత్రి పదవిపై పవన్ కళ్యాణ్ క్లారిటీ ఇచ్చారు. తానే మంత్రి పదవిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. నాగబాబుకు మంత్రి పదవి ఇచ్చేవిషయంపై ఇప్పటి వరకూ చర్చ అంటూ ఏమీ జరగలేదని తెలిపారు. అయితే ఒక విషయం మాత్రం పవన్ కళ్యాణ్ చెప్పారు. చంద్రబాబు నాయుడు తీసుకోవాల్సిన నిర్ణయం తీసుకున్నారని, కానీ తాను మాత్రమే దీనిపై ఆలోచిస్తున్నానని చెప్పడంతో పవన్ కళ్యాణ్ నిర్ణయం వల్లనే నాగబాబుకు మంత్రి పదవి ఆగిందని అనుకోవాలి. రాజకీయాల్లో ఉన్నప్పుడు కొన్నిసార్లు ఇబ్బందులు తప్పవన్నకల్యాణ్ ఆగస్టులో పదవుల విస్తరణపై తుది నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. పవన్ కళ్యాణ్ తాజా వ్యాఖ్యలు వింటే నాగబాబుకు మంత్రి పదవి దక్కే అవకాశం కనిపించడం లేదు. కుటుంబంలోని వారికే పదవులు ఇస్తున్నారని, ఒకే సామాజికవర్గానికి పదవులను పంచుతున్నారన్న అపప్రథను తాను ఎదుర్కొనాల్సి వస్తుందని పవన్ కళ్యాణ్ నాగబాబుకు మంత్రి పదవి విషయంలో ఆలోచిస్తున్నట్లు కనపడుతుంది. ఇప్పటికే జనసేనకు చెందిన ముగ్గురు మంత్రులుంటే అందులో ఇద్దరు కాపు సామాజికవర్గానికి చెందిన వారే. శాసనమండలిలో ఉన్న ఇద్దరు కూడా కాపు సామాజికవర్గానికి చెందిన వారే. ఇక మరో మంత్రి పదవి కూడా కాపు సామాజికవర్గానికి ఇస్తే తనపై కుల ముద్ర పడుతుందేమోనని పవన్ కళ్యాణ్ భయపడుతున్నట్లు తెలిసింది.... అందుకే చంద్రబాబు నాయుడు నాగబాబుకు మంత్రి పదవి ఇస్తామని మీడియా సమావేశంలో ప్రకటించి ఇన్ని నెలలు అవుతున్నా జనసేనాని వెనక్కు తగ్గినట్లు తెలిసింది. నాగబాబుకు మంత్రి పదవి ఇచ్చినందున పార్టీకి అదనంగా లభించే రాజకీయ ప్రయోజనం కూడా ఏమీ లేదని కూడా అంటున్నారు. ఎందుకంటే నాగబాబు కూడా ఫుల్ టైం పొలిటీషియన్ కాదు. ఏపీలో స్థిర నివాసం ఉండరు. ఇవన్నీ ఆలోచించి ఆయనకు ఇవ్వడం కంటే మరొక వ్యక్తికి పదవి ఇస్తే పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతం అవుతుందని పవన్ కళ్యాణ్ భావిస్తున్నట్లు కనపడుతుంది. నాగబాబుకు మంత్రి పదవి ఇచ్చినా యాక్టివ్ గా లేకపోయినా, సరిగా పనితీరు కనపర్చకపోయినా తాను మాట పడాల్సి వస్తుందేమోనని వెనక్కు తగ్గినట్లు కనపడుతుంది. మొత్తం మీద ఏపీ కేబినెట్ లో ఖాళీగా ఉన్న ఒక్క పోస్టు వచ్చే నెలలో భర్తీ అవుతుందా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

# జిల్లాల పేర్ల మార్పుపై కేబినెట్ సబ్‌కమిటీ

విజయవాడ, జూలై 24,ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పేర్ల మార్పుపై కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు అయింది. సభ్యులుగా మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, అనిత, జనార్ధన్‌రెడ్డి, రామానాయుడు, నాదెండ్ల, సత్యకుమార్ ఉంటారు. ప్రజల విజ్ఞప్తులపై సమగ్ర అధ్యయనం చేసి కమిటీ నివేదిక సమర్పిస్తుంది. సబ్‌కమిటీ నివేదిక ఆధారంగా జిల్లాల మార్పుపై నిర్ణయం తీసుకుంది. ప్రాంతీయ హక్కులకు ప్రాధాన్యత ఇవ్వాలని సబ్ కమిటీకి ప్రభుత్వం సూచించింది. జిల్లాలు, మండలాలు, గ్రామాల పేర్ల మార్పు , సరిహద్దుల సవరణలపై ప్రజల నుండి సూచనలు, విజ్ఞప్తులను కమిటీ సేకరిస్తుంది. ప్రజల అభిప్రాయాలను, చారిత్రక, సాంస్కృతిక, ప్రాంతీయ అంశాలను పరిగణనలోకి తీసుకొని సమగ్ర అధ్యయనం చేస్తుంది. అధ్యయనం ఆధారంగా సమగ్ర నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి కమిటీ సమర్పిస్తుంది. ప్రభుత్వం సూచించినట్లు, ప్రాంతీయ గుర్తింపు, సాంస్కృతిక విలువలు, చారిత్రక నేపథ్యం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చి సిఫారసులు చేస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో 2022లో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం 13 జిల్లాలను 26 జిల్లాలుగా పునర్విభజన చేసింది. ఈ జిల్లాల పేర్లు, సరిహద్దులు కొన్ని వివాదాస్పదంగా మారాయి. కొన్ని జిల్లాల పేర్లు, మండలాల సరిహద్దులపై స్థానికుల నుండి అభ్యంతరాలు, సూచనలు వచ్చాయి. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, పారదర్శకంగా, చారిత్రక మరియు సాంస్కృతిక ప్రాధాన్యతలకు అనుగుణంగా జిల్లాల పేర్లు, సరిహద్దులను మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజల నుండి సేకరించిన అభిప్రాయాలను పారదర్శకంగా పరిశీలించి, నిర్ణయాలు తీసుకోవాలని కమిటీకి సూచించారు. కమిటీ నిర్దిష్ట సమయంలో నివేదిక సమర్పించేలా చర్యలు తీసుకోనున్నారు. కమిటీ ప్రజల నుండి సేకరించిన సూచనలు, అధ్యయనాల ఆధారంగా నివేదిక సిద్ధం చేస్తుంది. ఈ నివేదిక ఆధారంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జిల్లాల పేర్ల మార్పు, సరిహద్దుల సవరణలపై తుది నిర్ణయం తీసుకుంటుంది. నిర్ణయం తీసుకునే ముందు, ప్రజల అభిప్రాయాలను విస్తృతంగా సేకరించడం, చర్చిస్తారు. ఈ చర్యను ప్రజాభిప్రాయాన్ని గౌరవించే దిశగా ఒక అడుగుగా భావిస్తున్నారు.

# కొలికపూడి యూ టర్న్

విజయవాడ, జూలై 24,రాజకీయాలు ఎప్పుడు ఒకే విధంగా ఉండవు. ఒకే విధంగా ఉంటే అవి రాజకీయాలు కావు.. అప్పటిదాకా పరస్పర విమర్శలు చేసుకున్న వారు కలిసిపోతారు. అప్పటిదాకా కలిసి ఉన్న నాయకులు విడిపోతారు.. అందువల్లే రాజకీయాలను ఎవరూ స్పష్టంగా అంచనా వేయలేరు. ఇలానే జరుగుతుందని చెప్పలేరు. ఇందుకు ఉదాహరణే ఇది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం గత ప్రభుత్వ తప్పులను వెలికి తీసే పనుల్లో కూటమి ప్రభుత్వం పడింది. ఇందులో భాగంగానే అక్రమాలకు పాల్పడ్డారంటూ కొంతమంది నేతలను కూటమి ప్రభుత్వం అరెస్టు చేయించింది.. అందులో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు ఒకరు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. అయితే లిక్కర్ కుంభకోణంలో ఆయన ప్రధాన పాత్రధారి అని.. వేల కోట్లను వేరే వైపు మళ్ళించారని ఆరోపిస్తూ ప్రత్యేక దర్యాప్తు బృందం అభియోగాలు నమోదు చేసింది.. దీనికోసం బలమైన సాక్ష్యాలను.. బలమైన ఆధారాలను కోర్టు ముందు ప్రవేశపెట్టింది. న్యాయమూర్తి అనుమతితో ఆయనను రిమాండ్ కు తరలించింది. ప్రస్తుతం మిథున్ రెడ్డి రాజమండ్రి జైల్లో ఉన్నారు. ఆయనను పరామర్శించడానికి తండ్రి రామచంద్ర రెడ్డి రాజమండ్రి వచ్చారు. రామచంద్ర రెడ్డి రాజమండ్రి విమానాశ్రయంలో ఉండగా ఆయనను టిడిపి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కలిశారు. ఈ సందర్భంగా వారు ఇద్దరు కాసేపు మాట్లాడుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాలలో సందడి చేస్తోంది. కొలికపూడి శ్రీనివాసరావు ఏం మాట్లాడారు? దానికి రామచంద్రారెడ్డి ఏం చెప్పారు? అసలు వీరిద్దరికి మాట్లాడుకోవాల్సిన అవసరం ఏం వచ్చింది? కొలికపూడి శ్రీనివాసరావు పార్టీ మారుతున్నారా? అనే ప్రశ్నలు ప్రస్తుతం ఏపీ రాజకీయాలలో చక్కర్లు కొడుతున్నాయి.ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి కొలికపూడి శ్రీనివాసరావు వివాదాస్పద పనులు చేస్తున్నారు. వివాదాలు కు కేంద్ర బిందువుగా మారారు. దీంతో ఆయనపై టిడిపి అధిష్టానం ఆ గ్రహంగా ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. గతంలో కొలికపూడి శ్రీనివాసరావు టిడిపి ఆస్థాన మీడియాలో కనిపించేవారు. ఆయన విశ్లేషకుడిగా దర్శనమిచ్చేవారు.



ఎప్పుడైతే టిడిపి అధిష్టానం ఆయన మీద ఆగ్రహం గా ఉందో.. అప్పటినుంచి శ్రీనివాసరావును టిడిపి ఆస్థాన మీడియా పక్కన పెట్టింది. మరోవైపు ఆయనపై వ్యతిరేకంగా కథనాలను ప్రచురిస్తోంది. ప్రసారం కూడా చేయిస్తోంది. ఇదే నేపథ్యంలో వైసీపీకి అనుకూలంగా ఉండే మీడియా శ్రీనివాసరావుకు పాజిటివ్ వార్తలు రాస్తూ ఉండడం విశేషం. అయితే అప్పట్లోనే శ్రీనివాసరావు వ్యవహార శైలి వేరే విధంగా ఉండడంతో ఆయన తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారని వార్తలు వినిపించాయి. అయితే ఆ తర్వాత అలాంటిది ఏమీ లేదని సంకేతాలు ఇవ్వడంతో ఆయన ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి శ్రీనివాసరావు నియోజకవర్గంలో అనేక వివాదాస్పద పనులకు పాల్పడ్డారు. ఒక అధికారి విషయంలో ఆయన అత్యుత్సాహాన్ని ప్రదర్శించారని ఆరోపణలు వినిపించాయి. దీనిపై అధిష్టానం ఆయన నుంచి వివరణ కోరినట్టు వార్తలు వినిపించాయి.. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ శ్రీనివాసరావ్ విషయంలో టిడిపి అధిష్టానం కాస్త మెత్తబడినట్టు సమాచారం.. మళ్లీ ఇన్ని రోజులకు శ్రీనివాసరావు వార్తల్లో వ్యక్తిగా నిలిచారు. ఏకంగా వైసిపిలో కీలక నాయకుడిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. పైగా పెద్దిరెడ్డి మిథన్ రెడ్డి జైల్లో ఉండడం.. కూటమి ప్రభుత్వం రామచంద్ర రెడ్డి పై ఆగ్రహంగా ఉన్న ప్రస్తుత తరుణంలోనే కొలికపూడి శ్రీనివాసరావు ఆయనను కలవడం విశేషం.. అయితే టిడిపి అధిష్టానం ఆగ్రహంగా ఉన్న నేపథ్యంలో శ్రీనివాసరావు పార్టీ మారతారని చర్చ నడుస్తోంది. అందువల్లే రామచంద్ర రెడ్డి తో మంతనాలు జరుపుతున్నారని.. జగన్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఫ్యాన్ కండువా కప్పుకోవడం ఖాయమని ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇంతవరకు శ్రీనివాసరావు వర్గీయులు ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. కొద్దిరోజులుగా వారు మౌనంగానే ఉంటున్నారు. మరోవైపు శ్రీనివాసరావు స్థానికంగా ఉన్న టిడిపి క్యాడర్ కు దూరంగా ఉంటున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ ప్రకారం చూసుకుంటే శ్రీనివాసరావు పార్టీ మారడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# విశాఖకు 20 వేలకోట్లు పెట్టుబడులు

విశాఖపట్టణం,జూలై 24, విశాఖపట్నం యువతకు పండుగలాంటి వార్త! టీసీఎస్, కాగ్నిజెంట్ బాటలో మరిన్ని దిగ్గజ సంస్థలు వైజాగ్ గడ్డపై పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నాయి. దాదాపు రూ.20 వేల కోట్ల పెట్టుబడులతో వేలాది ఉద్యోగాలు రానున్నాయి. ఏయే సంస్థలు వస్తున్నాయి? ఎక్కడ పెట్టుబడులు పెట్టనున్నారు? యువతకు ఎలాంటి అవకాశాలు లభించనున్నాయి? విశాఖపట్నం యువతకు ఎగిరి గంతేసే వార్త. సాగర తీరం విశాఖకు మరిన్ని ప్రతిష్టాత్మక సంస్థలు తరలి రానున్నాయి. విశాఖపట్నంలో టీసీఎస్ , కాగ్నిజెంట్ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. అలాగే లులు గ్రూప్ కూడా విశాఖపట్నంలో పెట్టుబడులు పెట్టనుంది. తాజాగా మరికొన్ని సంస్థలు వైజాగ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రాగా.. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఏపీ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనలు ఆమోదం లభించింది. రూ.20 వేల కోట్ల పెట్టుబడులకు స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు ఆమోదం తెలిపింది. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు మరో నాలుగు సంస్థలు ముందుకు రాగా.. ఆ ప్రతిపాదనలకు ఈ సమావేశంలో ఆమోదం లభించింది.సిఫి, సత్వా, ఏఎన్ఎస్ఆర్, బివిఎం సంస్థలు రాష్ట్రంలో రూ.20,216 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. ఈ పెట్టుబడుల ద్వారా 50,600 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం చెప్తోంది. సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్ విశాఖపట్నంలో సుమారుగా రూ. 16 వేల కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది.సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్ విశాఖపట్నంలో మొదటిదశలో రూ.1,466 కోట్ల పెట్టనుండగా.. దీని ద్వారా 200 మందికి ఉపాధి లభించనుంది. ఇక రెండో దశలో రూ.15,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఈ పెట్టుబడులతో 400 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. సిఫీ టెక్నాలజీస్.. ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీకి సంబంధించి సొల్యూషన్స్, సర్వీసెస్ ప్రొవైడర్‌గా పనిచేస్తుంది. సిఫీ దశల వారీగా ఏపీలో తమ సంస్థను ఏర్పాటు చేయనుంది. ఈ ఏడాది అక్టోబర్‌లో కార్యకలాపాలు ప్రారంభిస్తుంది.మధురవాడలో సాత్వా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 1,500 కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టనుంది. దీని ద్వారా 25,000 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. రెసిడెన్షియల్, కమర్షియల్ ఐటీ, ఐటీఈఎస్ పార్కులకు సంబంధించిన ప్రాజెక్టులను అభివృద్ధిలో ఈ సంస్థకు అనుభవం ఉంది. ప్రస్తుతం 8 నగరాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది.ఎండాడలో బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1,250 కోట్ల పెట్టుబడులు పెట్టనుండగా.. దీని ద్వారా 15 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. కపిల్ గ్రూపునకు చెందిన బీవీఎం.. విశాఖపట్నంలో మినీ స్మార్ట్ టెక్ సిటీ ఏర్పాటు చేయనుంది. ఆఫీస్ స్పేస్, కోవర్కింగ్ స్పేస్, ఎంప్లాయీ రెసిడెన్సెస్ వంటివి ఈ సంస్థ ఏర్పాటు చేయనుంది. ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ మధురవాడలో వేయి కోట్లు పెట్టుబడి పెట్టనుండగా..10,000 ఉద్యోగావకాశాలు వస్తాయి. ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు.. డిజైనింగ్, ఎస్టాబ్లిషింగ్, జీసీసీ ఆపరేటింగ్‌లో అనుభవం ఉంది. ఇండియాతో సహా పోలాండ్, యూఏఈలో కూడా కార్యకలాపాలు సాగిస్తోంది.మరోవైపు కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకూ జరిగిన ఎస్ఐపీబీ సమావేశాల్లో 113 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తంగా రూ.5,94,454 కోట్ల విలువైన పెట్టుబడులు ఏపీకి రానున్నాయి. అలాగే 5,56,568 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయని ప్రభుత్వం వెల్లడించింది.

# తిరుమలలో దర్శన కష్టాలు

తిరుమల, జూలై 24, తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలవుల అనంతరం కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది. సోమవారం నాడు 77,481 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అందులో 30,612 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. ఆ ఒక్క రోజే హుండీ ద్వారా రూ.3.96 కోట్ల ఆదాయం సమకూరింది. ఆలయ ప్రాంగణంలోని అన్ని కంపార్ట్మెంట్లు భక్తులతో నిండిపోయాయి. టోకెన్ లేని సర్వదర్శనం భక్తులకు స్వామివారి దర్శనానికి 18 గంటల నుంచి 20 గంటల వరకు సమయం పట్టింది. కంపార్ట్మెంట్లు, క్యూలైన్లలో ఉన్న వారికి టీటీడీ సిబ్బంది, శ్రీవారి సేవకులు అన్నప్రసాదం, అల్పాహారం, పాలు, మంచినీరు పంపిణీ చేశారు.



దర్శనానికి వచ్చే భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించాలని టిటిడి నిర్ణయించింది. ముఖ్యంగా టోకెన్ల జారీ ప్రక్రియను మరింత సులభతరం చేయాలని భావించింది. త్వరితగతిన శ్రీవారి దర్శన టికెట్లు దారి చేయడానికి వీలుగా తిరుమలలో కొత్తగా దర్శనం టికెట్ల కేంద్రం ఏర్పాటు చేసింది. దీని నిర్మాణం కోసం టీటీడీ 60 లక్షల రూపాయలను ఖర్చు చేసింది. తిరుమల అన్నమయ్య భవనం ఎదురుగా నూతన శ్రీవాణి దర్శన టికెట్ల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు దీనిని ప్రారంభించారు. భక్తుల కోసం ఈ కొత్త కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పుకొచ్చారు.మరోవైపు తిరుపతిలో స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్లు ఉన్నవారికి.. సిఫారసు లేఖలతో గదులు ఇవ్వడం ఇకపై కుదరదు. టీటీడీ ఈ విధానాన్ని రద్దు చేసింది. ఈ స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్లకు సంబంధించి భక్తులు తిరుపతిలోని విష్ణు నివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్ లలో పొందుతారు. వీరు నేరుగా దర్శనానికి వెళ్లాల్సి ఉంటుంది. అయితే చాలామంది సిఫారసు లేఖలతో గదులు పొందుతున్నారు. ఇది మిగతా భక్తులకు ఇబ్బందికరంగా మారుతోంది. అందుకే టీటీడీ ఈ నిర్ణయం తీసుకుంది. తిరుమల శ్రీవారి దర్శనం కోసం 300 రూపాయల టికెట్లు ఉన్న సుదూర ప్రాంత భక్తులకు మాత్రమే సిఫారసు లేఖలపై గదులు ఇస్తారు. అయితే శ్రీవాణి టిక్కెట్లు పొందిన భక్తులు రెండు మూడు గదులు తీసుకుంటున్నారు అన్న ఫిర్యాదులు ఉన్నాయి. అందుకే ఇప్పుడు కుటుంబ సభ్యుల సంఖ్యను బట్టి మాత్రమే గదులు కేటాయించనున్నారు.

# 8 మంది మంత్రులకు చెక్

విజయవాడ, జూలై 24, మంత్రివర్గ విస్తరణ పైగత కొద్ది రోజులుగా అనేక రకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే తాజాగా మరింత ఎక్కువయ్యాయి. మంత్రివర్గ ప్రక్షాళన ఖాయమని తెలుస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు 13 నెలలు పూర్తవుతోంది. మంత్రుల పనితీరుపై ఎప్పటికప్పుడు మదింపు జరుగుతోంది. పలువురు మంత్రులను హెచ్చరిస్తూ సీఎం ఎప్పటికప్పుడు పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. అయినా సరే చాలామంది తీరులో మార్పు రావడం లేదు. ఈ తరుణంలో మంత్రివర్గ ప్రక్షాళనకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. ఓటమి వర్గాల్లో మంత్రివర్గ విస్తరణ పై చర్చ సాగుతోంది. అయితే కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న తరుణంలో మంత్రివర్గ విస్తరణ జరుగుతుందా? మరికొంత సమయం వేచి చూస్తారా? అన్న చర్చ కూడా సాగింది. అయితే ఏపీ మంత్రివర్గ ప్రక్షాళనకు సంబంధించి ముహూర్తం ఫిక్స్ చేసినట్లు ప్రచారం ప్రారంభం అయ్యింది.ప్రస్తుతం ఏపీ మంత్రివర్గంలో 24 మంది మంత్రులు ఉన్నారు. జనసేననుంచి ముగ్గురు, బిజెపి నుంచి ఒకరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒక మంత్రి పదవి ఖాళీగా ఉంది. అయితే చాలామంది మంత్రుల విషయంలో సీఎం అసంతృప్తిగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. క్యాబినెట్లో మంత్రులుగా ఉన్న పదిమంది తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన వారే. అయితే వారి ఎంపిక సమయంలోనే కీలక సూచనలు చేశారు. అత్యవసరం అయితే మంత్రివర్గ విస్తరణ చేపడతామని.. ఆ సమయంలో పదవులు వదులుకోవడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు సీఎం చంద్రబాబు. అందుకే ఇప్పుడు ఎనిమిది మంది మంత్రులకు ఉద్వాసన పలుకుతారని తాజాగా ప్రచారం ప్రారంభం అయ్యింది.మరోవైపు మెగా బ్రదర్ నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకోవడం తప్పనిసరి. ఈ విషయంలో పవన్ కళ్యాణ్ నిర్ణయమే ఫైనల్. మరోవైపు ఇప్పుడున్న మంత్రి పదవికి తోడు మరో పదవి బిజెపి కి కేటాయిస్తారని ప్రచారం సాగుతోంది. ఒకవైపు మిత్రపక్షాలకు ప్రాధాన్యం పెంచుతూ.. పార్టీలో సీనియర్లను క్యాబినెట్లోకి తీసుకోవాలని

## సీనియర్లుకు అవకాశం

చంద్రబాబు కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఆగస్టు 15లోగా ప్రక్షాళన ఉంటుందని సమాచారం. అదే జరిగితే టిడిపిలో సీనియర్లు ఎవరెవరికి మంత్రి పదవులు దక్కుతాయి? బిజెపిలో ఛాన్స్ ఎవరికి అనే చర్చ ప్రారంభం అయింది.మరోవైపు ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజును( మంత్రివర్గంలోకి తీసుకుంటారని తెలుస్తోంది. అదే జరిగితే రఘురామ కృష్ణంరాజు స్థానంలో సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని డిప్యూటీ స్పీకర్ చేస్తారని సమాచారం. జనసేన నుంచి మంత్రిగా ఉన్న కందుల దుర్గేష్ ను తప్పించి కొణతాల రామకృష్ణకు అవకాశం ఇస్తారని తెలుస్తోంది. ఉత్తరాంధ్ర నుంచి ముగ్గురు మంత్రులను తప్పించడం ఖాయమని తెలుస్తోంది. అదే జరిగితే పల్లా శ్రీనివాస్, కొణతాల రామకృష్ణ, కళా వెంకట్రావుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. గోదావరి జిల్లాలకు చెందిన వాసంశెట్టి సుభాష్ ను తప్పించే అవకాశం ఉందని కూడా ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం నెల్లూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రిని తప్పించి వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డిని క్యాబినెట్ లోకి తీసుకుంటారని సమాచారం.రాయలసీమ నుంచి సైతం చేర్పులు మార్పులు ఉండే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఓ మంత్రిని తప్పించి ఆ స్థానంలో మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి సోదరుడు కిషోర్ కుమార్ రెడ్డికి ఛాన్స్ ఇస్తారని ప్రచారం సాగుతోంది. ఇక కృష్ణాజిల్లా నుంచి ఒక మంత్రిపై వేటు వేస్తారని తెలుస్తోంది. అయితే సామాజిక, ప్రాంతీయ నవీకరణలకు అనుగుణంగా తుది నిర్ణయాలు జరగనున్నాయి. అన్ని సమీకరణలను ప్రామాణికంగా తీసుకుని చేర్పులు మార్పులు ఉంటాయని సమాచారం. అయితే ఒకేసారి ఎనిమిది మంది మంత్రులను తప్పించడం పెను సంచలనమే.

# దాచేపల్లి లో సిపిఐ మహాసభల గోడ పత్రికలు ఆవిష్కరణ

దాచేపల్లి, జూలై 24 :ఆగస్టు 7, 8 తేదీలలో నియోజకవర్గ కేంద్రమైన వినుకొండలో జరిగే సిపిఐ పల్నాడు జిల్లా ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణరెడ్డి అన్నారు. గురువారం నారాయణపురం లోని సిపిఐ మండల కార్యాలయంలో జిల్లా మహాసభల గోడ పత్రికలను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ, ఆగస్టు 7న జరిగే ప్రదర్శన బహిరంగ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి ఏ. మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శులు ఎస్ కె హుస్సేన్, కాసా రాంబాబు తదితరులు పాల్గొని ప్రసంగిస్తారు ఈ మహాసభలకు గురజాల నియోజకవర్గం నుండి పార్టీ సభ్యులు సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

# స్పోర్ట్స్ న్యూస్

## అది అన్యాయం.. పంత్ స్థానంలో మరో బ్యాటర్‌ను అనుమతించాలి: ఇంగ్లండ్ మాజీ క్రికెటర్

ఇంగ్లండ్‌తో నాలుగో టెస్ట్‌లో తీవ్రంగా గాయపడిన రిషభ్ పంత్ స్థానంలో మరో బ్యాటర్‌ను అనుమతించేలా ఐసీసీ రూల్స్‌ను మార్చాలని మాజీ క్రికెటర్ మైఖేల్ వాన్ డిమాండ్ చేశాడు. ఓ ఆటగాడు తీవ్ర గాయంతో తప్పుకున్న తర్వాత 10 మంది ఆటగాళ్లతోనే మ్యాచ్‌ను కొనసాగించడం అన్యాయమని అభిప్రాయపడ్డాడు. మాంచెస్టర్ వేదికగా బుధవారం ప్రారంభమైన నాలుగో టెస్ట్‌లో రిషభ్ పంత్ రివర్స్ స్వీప్ షాట్ ఆడబోయి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే.క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో రిషభ్ పంత్ రివర్స్ స్వీప్ ఆడే ప్రయత్నం చేయగా.. బంతి నేరుగా అతని కుడి పాదానికి బలంగా తాకింది. దాంతో తీవ్ర గాయమై రక్త స్రావమైంది. ఈ గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతో పంత్ తన కాలిని నేలపై పెట్టలేకపోయాడు. దాంతో అతన్ని గోల్ఫ్ కార్ట్ అంబులెన్స్ ద్వారా బయటకు తీసుకెళ్లారు. రిషభ్ పంత్ కుడి కాలి చివరి వేలికి ఫ్రాక్చర్ అయినట్లు తెలుస్తోంది. అతను ఈ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడని వార్తలు వస్తున్నాయి. బీసీసీఐ మాత్రం రిషభ్ పంత్ గాయంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. రిషభ్ పంత్ స్థానంలో ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ చేసే అవకాశం ఉన్నా.. అతను బ్యాటింగ్ చేయలేడు.దాంతో టీమిండియా 10 మందితోనే బ్యాటింగ్ చేయాల్సి ఉంటుంది. కంకషన్ గాయానికి మాత్రమే ప్లేయర్ టూ ప్లేయర్ రిప్లేస్‌మెంట్‌కు అవకాశం ఉంటుంది.పంత్ గాయంపై స్పందించిన మైఖేల్ వాన్.. కంకషన్ సబ్‌స్టిట్యూట్ తరహాలోనే ఇంజ్యూరీ రిప్లేస్‌మెంట్‌కు కూడా అవకాశం కల్పించేలా రూల్స్ మార్చాలని మైఖేల్ వాన్ డిమాండ్ చేశాడు. 'ఈ మ్యాచ్‌లో ఇంకా నాలుగు రోజుల ఆట మిగిలి ఉంది. ఇదొక అద్భుతమైన సిరీస్. ఇప్పటి వరకు ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. కానీ పంత్ గాయం కారణంగా ఇరు జట్ల పోరు 10 మంది ఆటగాళ్లు వర్సెస్ 11 మంది ఆటగాళ్లుగా మారింది. ఇది అన్యాయం. రిషభ్ పంత్ స్థానంలో మరో బ్యాటర్‌ను సబ్‌స్టిట్యూట్‌గా అనుమతించాలి.కంకషన్ సబ్‌స్టిట్యూట్ తరహాలోనే ఇంజ్యూరీ రిప్లేస్‌మెంట్‌కు అవకాశం ఇవ్వాలి. ఇది నా డిమాండ్. ఒకవేళ రెండో ఇన్నింగ్స్‌లో ఇలా జరిగితే.. జట్లు రూల్స్‌ను ఉల్లంఘించే అవకాశం ఉంటుంది. దురుద్దేశపూర్వకంగా ఇంజ్యూరీ రిప్లేస్‌మెంట్ తీసుకోవచ్చు. కానీ ఆటగాళ్లకు చేతి విరగడం, కాలు విరగడం వంటి పెద్ద గాయాలు అయినప్పుడు స్పష్టంగా తెలుస్తోంది. అప్పుడు సబ్‌స్టిట్యూట్ ఆటగాడిని అనుమతించాలి.'అని మైఖేల్ వాన్ డిమాండ్ చేశాడు. రిషభ్ పంత్ గాయం నేపథ్యంలో మైఖేల్ వాన్ చేసిన ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఆటగాళ్ల భద్రత, మ్యాచ్ సమతుల్యత దృష్ట్యా టెస్ట్ క్రికెట్‌లో సబ్‌స్టిట్యూట్ రూల్స్ మార్చాల్సిన అవసరం ఉందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.అయితే ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్ మాత్రం ఈ డిమాండ్‌ను తప్పుబట్టాడు. చిన్న గాయానికే రిప్లేస్‌మెంట్ కోరే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డాడు. 'అది చిన్న గాయమే అయితే పరిస్థితి ఏంటి? ఇంజ్యూరీ రిప్లేస్‌మెంట్‌కు నేను అంగీకరిస్తానా? లేదా? అనేది స్పష్టంగా చెప్పలేను. కానీ ఈ రూల్‌ను ఆయా జట్లు మిస్ యూస్ చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పంత్ తీవ్రమైన నొప్పితో మైదానం వీడాడు. అతనికి ఫ్రాక్చర్ కాకపోతే.. సబ్‌స్టిట్యూబ్ బ్యాటర్‌ను ఆడించాలా? చిన్న గాయాలకు కూడా ఈ రూల్‌ను వాడుకునే అవకాశం ఉంటుంది.'అని అలిస్టర్ కుక్ చెప్పుకొచ్చాడు.



## రిషభ్ పంత్.. ఈ రిస్కీ షాట్స్ వద్దు: రికీ పాంటింగ్

ఇంగ్లండ్‌తో నాలుగో టెస్ట్‌లో రివర్స్ స్వీప్ షాట్ ఆడబోయి తీవ్రంగా గాయపడిన టీమిండియా స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్‌కు ఆస్ట్రేలియా దిగ్గజ బ్యాటర్ రికీ పాంటింగ్ విలువైన సలహా ఇచ్చాడు. మళ్లీ ఎప్పుడూ ఇలాంటి రిస్కీ షాట్స్ ఆడవద్దని సూచించాడు. మాంచెస్టర్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో పంత్ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో రిషభ్ పంత్ రివర్స్ స్వీప్ ఆడే ప్రయత్నం చేయగా.. బంతి నేరుగా అతని కుడి పాదానికి బలంగా తాకింది. దాంతో తీవ్ర గాయమై రక్త స్రావమైంది.రిషభ్ పంత్ గాయంపై స్పందించిన రికీ పాంటింగ్.. ఫ్రాక్చర్ కావద్దని కోరుకున్నాడు. పంత్ దూరమైతే టీమిండియా తీరని నష్టమని చెప్పాడు. 'నేల మీద పాదం పెట్టేందుకు రిషభ్ పంత్ అల్లాడిపోయాడు. గోల్ఫ్ కార్ట్ వచ్చేవరకూ దాదాపు ఆరు నిమిషాల పాటు చాలా ఇబ్బందిపడ్డాడు. బంతి తగిలిన వెంటనే అతని పాదం వాచిపోయింది. ఈ వాపే ఆందోళనకు గురిచేస్తోంది. పాదం ఎముక ఏమైనా విరిగిందా? అనే సందేహం కలుగుతోంది.విరగడం లేదా ఫ్రాక్చర్ అయితే మాత్రం పంత్ ఈ మ్యాచ్‌కు దూరమైనట్లే. అలాకాకుండా ఉంటే మాత్రం పంత్‌ను వైద్య సిబ్బంది బ్యాటింగ్‌కు రెడీ చేస్తోంది. మళ్లీ ఎప్పుడూ ఇలాంటి రిస్కీ రివర్స్ స్వీప్ షాట్లను పంత్ ఆడదని ఆశిస్తున్నా. మ్యాచ్ పరిస్థితిని గమనిస్తే శార్దూల్ ఠాకూర్ మెరుగ్గానే బ్యాటింగ్ చేశాడు. కానీ పంత్ ఆడిన విధానం.. అతను తీసుకొచ్చే జోష్ టీమిండియాకు చాలా అవసరం. పంత్ క్రీజులో ఉంటే ప్రత్యర్థి ఆటగాళ్లపై ఒత్తిడి ఉంటుంది. భారత అభిమానులంతా పంత్ గాయం తీవ్రమైంది కాకూడదని కోరుకోవాలి. అతను దూరమైతే టీమిండియాకు తీవ్ర నష్టం జరుగుతుంది.'అని రికీ పాంటింగ్ చెప్పుకొచ్చాడు.అయితే స్కానింగ్‌లో రిషభ్ పంత్ కుడి కాలి చిటికెన వేలుకు ఫ్రాక్చర్ అయినట్లు తేలింది. దాంతో వైద్యులు అతనికి 6 వారాలా విశ్రాంతి తీసుకోవాలని చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే పంత్ గాయంపై బీసీసీఐ ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.





## చరిత్ర సృష్టించిన 19 ఏళ్ల దివ్య దేశ్‌ముఖ్

భారత యువ చెస్ క్రీడాకారిణి దివ్య దేశ్‌ముఖ్ ఫిడే మహిళల ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకుని చరిత్ర సృష్టించింది. ఆమె సెమీఫైనల్ మ్యాచ్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ తాన్ ఝోంగీని 1.5-0.5 తేడాతో ఓడించింది. ఈ టోర్నమెంట్ చరిత్రలో ఫైనల్‌కు చేరిన మొదటి భారతీయ మహిళగా దివ్య దేశ్‌ముఖ్ చరిత్ర సృష్టించింది. ఈ విజయంతో ఆమె తన మొదటి గ్రాండ్ మాస్టర్ నార్మ్‌ను కూడా సాధించింది. 19 ఏళ్ల దివ్య తెల్లపావులతో అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. దీంతో పాటు ఆమె 2026 మహిళల క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది.ఎఔఆ లబ ఇఔఉ: చరిత్ర సృష్టించిన యశస్వి జైస్వాల్.. 51 ఏళ్ల తర్వాత అరుదైన రికార్డ్!ఎఔఆ లబ ఇఔఉ: చరిత్ర సృష్టించిన యశస్వి జైస్వాల్.. 51 ఏళ్ల తర్వాత అరుదైన రికార్డ్!ప్రపంచ నంబర్ 18 అయిన దివ్య మొదటి సెమీఫైనల్‌లో నల్లపావులతో ఆడి డ్రా చేసుకుంది. రెండో గేమ్‌లో ఆమెకు తెల్లపావులతో ఆడటం ప్రయోజనకరంగా మారింది. ఆమె మిడ్ గేమ్‌లో తాన్ ఝోంగీ చేసిన తప్పులను సొమ్ముగా మార్చుకుంది. దివ్య తన నైపుణ్యాన్ని విజయంగా మార్చుకుంది. ఈ గెలుపు భారత మహిళా చెస్‌కు గొప్ప విజయం.ఇదిలా ఉండగా.. గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి రెండో సెమీఫైనల్ చైనాకు చెందిన లీ టింగీతో డ్రా అయింది. ఇప్పుడు ఆమె టై-బ్రేక్ ఆడవలసి ఉంటుంది. హంపికి తెల్లపావులు ఉన్నప్పటికీ, ఆమె లీ టింగ్జీ బలమైన రక్షణను ఛేదించలేకపోయింది. ఇప్పుడు ఈ ఇద్దరు క్రీడాకారిణులు గురువారం రాపిడ్, బ్లిట్జ్ టై-బ్రేక్ గేమ్స్ ఆడతారు. దీని ద్వారా ఫైనల్‌లో రెండో స్థానం ఎవరికి లభిస్తుందో తెలుస్తుంది.ఎఔఆ లబ ఇఔఉ: రాణించిన జైస్వాల్, సాయి.. భారీ స్కోర్ దిశగా భారత్!ఎఔఆ లబ ఇఔఉ: రాణించిన జైస్వాల్, సాయి.. భారీ స్కోర్ దిశగా భారత్!ఈ టోర్నమెంట్ సెమీఫైనల్స్‌లో ఇద్దరు భారతీయ క్రీడాకారిణులు ఉన్నారు. దివ్య దేశ్‌ముఖ్ ఫైనల్‌కు చేరుకునే క్రమంలో అనేక గొప్ప క్రీడాకారిణులు ఓడించింది. దివ్య నిర్భయంగా, దూకుడుగా చెస్ ఆడింది. తాన్ ఝోంగీ తన బలమైన ఆటతీరుకు ప్రసిద్ధి చెందింది. దివ్య ఆమెను ఓడించి మహిళా చెస్‌లో తాను ఒక కొత్త స్టార్ అని నిరూపించుకుంది.



## రిషబ్ పంత్‌కు గాయం.. ఆరు వారాలు రెస్ట్.. సిరీస్ నుంచి ఔట్



ఓల్డ్ ట్రాఫర్డ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న నాలుగవ టెస్టులో రిషబ్ పంత్ గాయపడ్డ విషయం తెలిసిందే. వోక్స్ బౌలింగ్‌లో రివర్స్ స్వీప్ కోసం ప్రయత్నం చేయగా, ఆ బంతి పంత్ పాదానికి తగిలింది. ఆ గాయానికి చెందిన స్కానింగ్ రిపోర్టును రిలీజ్ చేశారు. కాలు పాదానికి ఫ్రాక్చర్ అయినట్లు తెలుస్తోంది. పెయిన్ కిల్లర్లు తీసుకుని పంత్ బ్యాటింగ్ చేయగలడా లేదా అన్న కోణంలో బీసీసీఐ మెడికల్ బృందం అన్వేషిస్తున్నది. ఆరు వారాల పాటు అతనికి రెస్ట్ ఇచ్చే ఛాన్సు ఉంది. మరొకరి సపోర్టుతో పంత్ బ్యాటింగ్ చేస్తున్నాడని, అతను బ్యాటింగ్‌కు వచ్చేది అనుమానంగానే తోస్తోందని బీసీసీఐ వర్గాలు భావిస్తున్నాయి. ఇంగ్లండ్ టూరు నుంచి అతన్ని తప్పించినట్లు తాజా సమాచారం ద్వారా తెలుస్తోంది.గాయం తీవ్రంగా ఉండడం వల్ల అతన్ని ఇంగ్లండ్ టూరు నుంచి పూర్తిగా తప్పించే అవకాశాలు ఉన్నాయి. లండన్‌లోని ఓవల్‌లో జూలై 31 నుంచి అయిదో టెస్టు జరదాల్సి ఉంది. మాంచెస్టర్ టెస్టు తొలి రోజు 68వ ఓవర్‌లో గాయం కాగానే పంత్ తన కాలు కింద పెట్టేందుకు తీవ్ర ఇబ్బందిపడ్డారు. టీమ్ ఫిజియో హుటాహుటిన్ గ్రౌండ్‌కు వెళ్లాడు. బంతి బలంగా తగలడంతో.. కుడి కాలు చివరి వేలి వద్ద రక్తం వచ్చింది. క్షణాల్లో ఆ ప్రదేశం వాచింది. కాలు కింద పెట్టేందుకు 27 ఏళ్ల బ్యాటర్ కష్టపడ్డాడు. గోల్ఫ్ స్టయిల్ బగ్గీలో గాయపడ్డ పంత్‌ను తరలించారు.ఇంగ్లండ్‌తో జరుగుతున్న 5 మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటి వరకు ఏడు ఇన్నింగ్స్‌లో 462 రన్స్ చేశాడు. ప్రస్తుత టూర్‌లో అత్యధిక స్కోరు చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. ఈ సిరీస్‌లో శుభమన్ గిల్ 619 రన్స్ చేసి టాప్‌లో ఉన్నాడు.

## మరోసారి ఇంగ్లండ్ పర్యటనకు భారత్.. ఈసారి ఏ ఫార్మాట్ అంటే..



టీం ఇండియా ప్రస్తుతం ఇంగ్లండ్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఆతిథ్య జట్టుతో భారత్ ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో తలపడుతోంది. ఇప్పటికే ఈ సిరీస్‌లో మూడో మ్యాచ్‌లు పూర్తి కాగా.. నాలుగో టెస్ట్ మాంచెస్టర్ వేదికగా జరుగుతోంది. అయితే వచ్చే ఏడాది భారత్ మరోసారి ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. ఈసారి వన్డే, టి-20 ఫార్మాట్‌లలో టీం ఇండియా, ఇంగ్లండ్‌తో తలపడనుంది. 2026 జూలైలో ఇంగ్లండ్‌తో ఐదు టి-20లు, 3 వన్డేలు ఆడనుంది.వచ్చే ఏడాది జూలై 1న దర్హమ్, 4న మాంచెస్టర్, 7న నాట్టింగ్‌హామ్, 9న బ్రిస్టల్, 11న సౌతాంప్టన్ వేదికలుగా టి-20లు జరుగనున్నాయి. ఇక జూలై 14వ తేదీన బర్మింగ్‌హామ్‌లో, 16న కార్డిఫ్‌లో, 19న లార్డ్స్‌లో వన్డే మ్యాచులు ఆడనుంది. ఇక వచ్చే ఏడాది సమ్మర్‌లో ఇంగ్లండ్ తమ పూర్తి షెడ్యూల్‌ని గురువారం ప్రకటించింది. భారత్‌తో పాటు, న్యూజిలాండ్, పాకిస్థాన్, శ్రీలంకలతో ఇంగ్లండ్ పురుషుల జట్టు తలపడుతుంది. ఇంగ్లండ్ మహిళల జట్టు షెడ్యూల్‌ని కూడా ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. న్యూజిలాండ్, ఇండియా, ఐర్లాండ్‌తో ఇంగ్లండ్ మహిళల జట్టు మ్యాచ్‌లు ఆడనుంది. భారత మహిళలతో మే 28న చెల్మ్స్‌ఫోర్డ్, మే 30న బ్రిస్టల్, జూన్ 2 టౌంటన్‌లో మూడు టి-20లు, జూలై 10-14 వరకూ లార్డ్స్‌లో ఓ టెస్ట్ మ్యాచ్ ఇంగ్లండ్ జట్టు ఆడనుంది.

## ఇంకొన్ని రన్స్ చేస్తే.. జడేజా ఖాతాలో అరుదైన రికార్డు

ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో టీం ఇండియా ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా మంచి ప్రదర్శన చేస్తున్నాడు. ముఖ్యంగా లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్‌లో జట్టును గెలిపించేందుకు ఆఖరి వరకూ కృషి చేశాడు. కానీ, విజయం మాత్రం ఇంగ్లండ్‌ను వరించింది. అయితే ఇప్పుడు మాంచెస్టర్ వేదికగా జరుగుతున్ నాలుగో టెస్ట్‌లో తొలి రోజే బ్యాటింగ్‌కి వచ్చిన జడేజా.. తనదైన శైలిలో ఇంగ్లండ్ బౌలర్లను ఎదురుకుంటూ పరుగులు రాబడుతున్నాడు. ఈ క్రమంలో ఓ అరుదైన రికార్డు జడేజాను ఊరిస్తోంది.ఈ మ్యాచ్‌లో జడేజా మరో 12 పరుగులు చేస్తే.. ఇంగ్లండ్ గడ్డపై 1000+ పరుగులు, 30+ వికెట్లు సాధించిన తొలి భారత ఆటగాడిగా జడేజా రికార్డు సృష్టిస్తాడు. ఓవరాల్‌గా చూస్తే.. ఈ రికార్డును కేవలం వెస్టిండీస్ దిగ్గజ క్రికెటర్ గ్యారీ సోబర్స్ పేరిట ఉంది. అతడు 21 టెస్టుల్లో 1,820 పరుగులు, 30 వికెట్లు పడగొట్టాడు. జడేజా ప్రస్తుతం 988 పరుగులు చేసి ఇప్పటికే 30 వికెట్లు తీశాడు. దీంతో ఈ అరుదైన రికార్డును సాధించేందుకు జడేజాకు మరో 12 పరుగుల అవసరం ఉంది.కాగా, నాలుగో టెస్ట్‌లో ఇంగ్లండ్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కి దిగిన భారత్ తొలి రోజు ఆచితూచి బ్యాటింగ్ చేసింది. భారత బ్యాటింగ్‌లో సాయి సుదర్శన్ 61, యశస్వీ జైసాల్ 58, కెఎల్ రాహుల్ 46 పరుగులు చేశారు. 37 పరుగులు చేసిన రిషబ్ పంత్ రి?టైర్ హర్ట్ అయ్యాడు. తొలి రోజు ఆట ముగిసే సరికి భారత్ 4 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. ఇంగ్లండ్ బౌలింగ్‌లో స్టోక్స్ , డ్వాసన్, వోక్స్ తలో వికెట్ తీశారు.



# మీ చర్మంలో ఈ మార్పులు ఉంటే మీకు ఖచ్చితంగా డయాబెటిస్ వచ్చే అవకాశం ఉంది ..!



ఇంటర్నేషనల్ డయాబెటిస్ ఫెడరేషన్ ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 42.5 మిలియన్ల మంది మధుమేహంతో బాధపడుతున్నారు. ఈ సంఖ్య 2045 నాటికి 62.9 కోట్లకు పెరిగే అవకాశం ఉంది. డయాబెటిస్ దీర్ఘకాలిక వ్యాధి, ఇది అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. శుభవార్త ఏమిటంటే మీరు సాధారణ జీవనశైలి మార్పులు మరియు సాధారణ మందులు వేసుకోవడం ద్వారా ఈ పరిస్థితిని నిర్వహించవచ్చు. ాఎతిని అష్ట్రజీనిణవబ ుష్ట్రజీబి అజీని ఎనిటతిఇజీబివ ఆతిజీఎవబివబ టైప్ 2 డయాబెటిస్ ఉన్న కొంతమంది జీవనశైలిలో మార్పులు చేయడం ద్వారా తమ పరిస్థితిని మార్చుకున్నారని పేర్కొన్నారు. డయాబెటిస్ మీ చర్మంతో సహా శరీరంలోని అనేక భాగాలను ప్రభావితం చేస్తుంది. మీ చర్మంలో కొన్ని మార్పులు వచ్చినప్పుడు అది డయాబెటిస్‌కు సంకేతం కావచ్చు. మీకు ఈ మార్పులు ఉంటే వెంటనే షుగర్ పరీక్ష చేయాలి. చర్మంపై పసుపు, ఎరుపు లేదా గోధుమ పాచెస్ చర్మంపై పసుపు, ఎరుపు లేదా గోధుమ పాచెస్ స్కిన్ కండిషన్ నెక్రోబయోసిస్‌ను లిపోయిడికా అంటారు మరియు మొటిమలా కనిపించే గట్టి బంప్‌గా ప్రారంభమవుతుంది. ఇది పెరిగేకొద్దీ ఈ గడ్డలు గట్టిగా మరియు వాపు చర్మం పాచెస్ అవుతాయి. పాచెస్ ఎరుపు, పసుపు లేదా గోధుమ రంగులో ఉండవచ్చు. పాచ్ చుట్టూ చర్మం మెరిసేలా కనిపిస్తుంది, మీరు రక్త నాళాలను చూడవచ్చు మరియు ఇది దురద మరియు నొప్పిని కలిగిస్తుంది. మీ చర్మంపై ఇలాంటి పాచెస్ కనిపిస్తే వెంటనే రక్త పరీక్ష చేయించుకోండి. వెల్వెట్ లాగా అనిపించే ముదురు చర్మం పాచెస్ వెల్వెట్ లాగా అనిపించే ముదురు చర్మం పాచెస్ మీ మెడపైన మృదువైన మరియు ముదురు చర్మ పరిస్థితులు ఉంటే అది ప్రమాదకరమైన సంకేతం. చంకలు, పండ్లు లేదా మరెక్కడా మీ రక్తంలో ఇన్సులిన్ ఎక్కువగా ఉందని ఇది సూచిస్తుంది. ఈ పాచెస్ ప్రిడియాబయాటిస్ యొక్క సంకేతం. ఈ పరిస్థితికి వైద్యం పేరు అకాంతోసిస్ నైగ్రికాన్స్. బోర్డర్‌లైన్ డయాబెటిస్ అంటే ఏమిటి? హెచ్చరిక సంకేతాలు, ఈ ప్రమాదాన్ని తగ్గించడానికి మీరు తీసుకోవలసిన జాగ్రత్తలు బొబ్బలు బొబ్బలు ఇది చాలా సాధారణం కానప్పటికీ, కొన్ని సందర్భాల్లో, డయాబెటిస్ ఉన్నవారికి చర్మంపై బొబ్బలు కనిపిస్తాయి. మీరు పెద్ద పొక్కు లేదా చాలా బొబ్బలు కనుగొనవచ్చు. ఈ బొబ్బలు సాధారణంగా చేతులు, కాళ్ళు, కాళ్ళు మరియు ముంజేయిపై కనిపిస్తాయి మరియు తీవ్రమైన కాలిన తర్వాత కనిపించే బొబ్బలు లాగా కనిపిస్తాయి. కాలిన గాయాల వల్ల వచ్చే బొబ్బలు కాకుండా, ఇవి నొప్పిలేకుండా ఉంటాయి. గాయం నయం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది గాయం నయం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది అధిక రక్తంలో చక్కెర స్థాయిలు రక్త ప్రవాహం మరియు నరాల దెబ్బతినడానికి దారితీస్తుంది. పేలవమైన రక్త ప్రవాహం మరియు దెబ్బతిన్న సిరలు మీ శరీరానికి గాయాలను నయం చేయడం కష్టతరం చేస్తుంది. ఇది కాళ్ళకు ప్రత్యేకంగా వర్తిస్తుంది. ఈ బహిరంగ గాయాలను డయాబెటిక్ అల్సర్ అంటారు. బహిరంగ పుండ్లు మరియు గాయాల కోసం మీ పాదాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయండి. ఓూాు ఖీఇంఆ : తెలియకుండా మీరు చేసే ఈ సాధారణ తప్పుల వల్లే డయాబెటిస్ వస్తుంది చాలా పొడి మరియు దురద చర్మం ఒక ఇరాకీ జూ లాటరీ గెలుచుకున్నాడు, భారతీయులు అతన్ని అనుసరిస్తున్నాం

# కిడ్నీతో సమస్య ఉందా? ఈ ఆహారాలను అన్ని వేళలా

మూత్రపిండాల్లో రాళ్ల కేసులు నేడు చాలా సాధారణం మరియు అనేక ఆరోగ్య సంరక్షణ సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. మన శరీరంలోని అతి ముఖ్యమైన అవయవాలలో ఒకటైన మూత్రపిండాలు మన శరీర రక్తాన్ని ఫిల్టర్ చేసి మలినాలను తొలగించే చెట్లుగా పనిచేస్తాయి. మూత్రపిండాల యొక్క ప్రధాన విధి ఏమిటంటే, అదనపు సెలైన్ మరియు నీటిని మూత్ర నాళంలో విసర్జించడం ద్వారా సేకరించడం. ఈనీనీటబ ఎనీ ంలనీతిట ఈనీతీ ఐతిటనివఎ ాబినీనివబ ఈ రోజు కిడ్నీ రాళ్లతో బాధపడుతున్న రోగుల సంఖ్య పెరుగుతోంది. ఈ రాళ్ళు మూత్రపిండాల లోపలికి ఎలా వెళ్ళాయి? వాస్తవానికి ఏ రాయి లోపలికి వెళ్ళదు, బదులుగా కిడ్నీ లోపల ఏర్పడుతుంది. ఉప్పు కణాలు అంటుకునే లక్షణాలను కలిగి ఉంటాయి. మూత్రం మోతాదు, మూత్రంలో ప్రోటిన్, క్యాల్షియం పెరిగేకొద్దీ, ఈ ఉప్పు కణాలు ఒకదానికొకటి కట్టుబడి ఉండే అవకాశాన్ని పెంచుతాయి .... కెఫిన్ / సోడా కారణాలు కెఫిన్ / సోడా కారణాలు మీకు ఇప్పటికే మూత్రపిండాల్లో రాళ్ళు ఉంటే, మీకు పుష్కలంగా ద్రవం అవసరం. కానీ ఈ ద్రవాలలో కెఫిన్ తక్కువగా ఉండాలి. మీరు కాఫీ టీకి బానిసలై, సంయమనం పాటించే స్థితిలో ఉంటే, మీరు రోజుకు ఒకటి నుండి రెండు కప్పులు (250-500 మి.లీ) కాఫీ లేదా టీని మాత్రమే తాగవచ్చు. సోడా అవసరం లేదు. మీరు తేలికపాటి పానీయాన్ని ఊహించలేరు. మీ శరీరంలో ఎక్కువ కెఫిన్ పేరుకుపోతుంది మరియు మీ మూత్రపిండాలలో రాళ్ళు పెద్దవిగా మరియు నిర్జలీకరణానికి కారణమవుతాయి. సోడియం అధికంగా ఉండే ఆహారాలు సోడియం అధికంగా ఉండే ఆహారాలు రెడీమేడ్ ఫుడ్స్ ఎక్కువసేపు ఉండేలా ఉప్పు మరియు ఇతర సంరక్షణకారులను కలుపుతారు. అందువల్ల, మీరు ఊరగాయ, తయారుగా ఉన్న ప్యాకేజ్డ్ ఆహారాలు, ఉప్పు చల్లిన స్నాక్స్, వేడి తినదగిన ప్యాకెట్‌లో తినడానికి సిద్ధంగా ఉన్న ఆహారాలు, పానీ పూరి వంటి రోడ్‌సైడ్ ఆహారాలు మానుకోవాలి. వీలైనంత వరకు ఉప్పు తక్కువగా ఉన్న ఆహారాన్ని తినండి. అధిక ప్రోటీన్ కలిగిన ఆహారాలు అధిక ప్రోటీన్ కలిగిన ఆహారాలు మాంసం మరియు చేప ఆహారాలలో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. అందువల్ల, వీటిని మితంగా మాత్రమే తినాలి. ఎందుకంటే శరీరంలోని ఇతర పనులకు మనకు ప్రోటీన్ అవసరం. అందువల్ల, ఎర్ర మాంసానికి బదులుగా, తెల్ల మాంసం, చికెన్ మరియు చేపలను చిన్న నూనెల రూపంలో తినాలి లేదా నీటిలో ఉడికించాలి. సుగంధ ద్రవ్యాలకు దూరంగా ఉండటం మంచిది. అధిక కొవ్వు పదార్థాలు అధిక కొవ్వు పదార్థాలు వెన్న, జున్ను, క్రీమ్, వనస్పతి మరియు తక్కువ కొవ్వు లేదా తక్కువ కొవ్వు కలిగిన పాల ఉత్పత్తులు వంటి అధిక కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండండి. తాజా పాలకు బదులుగా, స్కిమ్డ్ పాలను అల్పాహారం సమయంలో తీసుకోవచ్చు. కానీ రోజులో ఏ సమయంలోనైనా కొవ్వు పదార్థాలు తినకూడదు. కొవ్వు మరియు రాళ్ల పరిమాణంలో పెరుగుదల. కాల్షియం అధికంగా ఉండే ఆహారాలు రూ.537/నెల× 1అతీ టర్మ్ ప్లాన్ కొని కుటుంబ ఆర్థిక భవిష్యత్తు భద్రపరచండి. . ఆహారం/ వ్యాయామం లేకుండా కొవ్వు తగ్గే మార్గం డాక్టర్ కనుగొన్నారు సహజసిద్ధమైన హెయిర్ గ్రోత్! ఈ ఆయుర్వేద నూనెను వాడి చూడండి ఊజీతితీ ాతిశ్రీ






కాల్షియం అధికంగా ఉండే ఆహారాలు ఉప్పు అధికంగా ఉండే ఆహారాలలో కాల్షియం మరియు విటమిన్ డి అధికంగా ఉంటాయి. మూత్రపిండాల్లో రాళ్లు ఉన్నవారు ఈ ఆహారాలను నిరంతరం నివారించాలి. ఈ వ్యక్తులు కడుపులో గ్యాస్ ఉంటే ఇంట్రావీనస్ కూడా తీసుకోవాలి. ఎందుకంటే ఇందులో కాల్షియం చాలా ఎక్కువ. కాల్షియం అధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవడం మూత్రపిండాల రాళ్ల పరిమాణాన్ని పెంచడానికి బహిరంగ ఆహ్వానం. ఉప్పు లేని ఆహారం తినడం కష్టం, కానీ మీరు చాలా తక్కువ ఉప్పు తినాలి. దీనిని ఫిష్ ఆయిల్ లేదా విటమిన్ డి మాత్రలతో తీసుకోవచ్చు, అయితే దీనికి డాక్టర్ అనుమతి అవసరం. ఆక్సలేట్ అధికంగా ఉండే ఆహారాలు ఆక్సలేట్ అధికంగా ఉండే ఆహారాలు మూత్రపిండాల్లో రాళ్ళు ఉన్న రోగులకు ఈ ఆహారాలు ముఖ్యంగా ఉపయోగపడతాయి, ముఖ్యంగా మీ రాళ్ళు ఆక్సలేట్ రాళ్ళు అయితే. టీ, కాఫీ బీట్‌రూట్, స్క్వాష్, బంగాళాదుంపలు, పాలక్, టొమాటో సూప్, డబ్బాల్లో ప్యాక్ చేసిన ఫ్రూట్, రబర్బ్ రూట్, స్ట్రాబెర్రీ వంటి ఆహారాలకు దూరంగా ఉండాలి. చాక్లెట్లు, టోఫు, ఎండుద్రాక్ష, వోట్మీల్ ఆధారిత ఆహారాలకు దూరంగా ఉండాలి. మీ ఆరోగ్య పరీక్షను అనుసరించి, మీ డాక్టర్ మీకు సరైన ఆహారాన్ని సూచిస్తారు. మీ రాళ్ళు యూరిక్ యాసిడ్ వల్ల వచ్చినా మీరు ఈ ఆహారాలు తీసుకోకూడదు. ఆల్కహాల్ ఆల్కహాల్ మూత్రపిండాల్లో రాళ్ళు నేరుగా ఆల్కహాల్ నుండి ఏర్పడకపోయినా, అవి ఇతర కారణాల వల్ల పరోక్షంగా ప్రేరేపించబడతాయి. ప్యూరిన్ అనే ఆల్కహాల్ పోషకం నేరుగా యూరిక్ యాసిడ్ రాళ్లకు దారితీస్తుంది. ఆల్కహాల్ కిడ్నీ పనితీరును కూడా తగ్గిస్తుంది. కాబట్టి మద్యపానానికి దూరంగా ఉండటం మంచిది. ఆంకోవీస్, ఎండిన చేప ఆంకోవీస్, ఎండిన చేప చాలా చేపలు సాధారణంగా తరువాత ఉప్పు మరియు ఎండబెట్టబడతాయి. కానీ మూత్రపిండాల్లో రాళ్ళు ఉన్న రోగులకు ఈ ఆహారం ఒక విషం. ఇవి చిన్న పరిమాణంలో వినియోగించినా నేరుగా రాళ్ల పరిమాణాన్ని పెంచుతాయి. కాబట్టి డ్రైయర్ పేరును హైలైట్ చేయడం మంచిది. ఆస్పరాగస్ ఆస్పరాగస్ ఇది అద్భుతమైన మూత్రవిసర్జన. కానీ మూత్రపిండాల్లో రాళ్ళు ఉన్న రోగులకు ఇది జమ కాదు. బేకింగ్ సోడా / బ్రెడ్ మేకింగ్ ఈస్ట్ బేకింగ్ సోడా / బ్రెడ్ మేకింగ్ ఈస్ట్ యూరిక్ యాసిడ్ మరకలతో మీకు సమస్య ఉంటే, బేకింగ్ సోడా లేదా బ్రెడ్ బేకింగ్ వంటి బ్రూవర్ ఈస్ట్ జోడించిన ఆహారాన్ని మీరు యాక్సెస్ చేయలేరు. ప్యూరిన్ అనే పోషకం రాళ్ల పరిమాణాన్ని పెంచడానికి నేరుగా కారణమవుతుంది. ఈ ఆహారాలతో పాటు, చిక్కుళ్ళు, పుట్టగొడుగులు, ఆలివ్ ఆయిల్ మరియు పప్పుధాన్యాలు, కాలీఫ్లవర్, కిడ్నీ మరియు కాలేయం వంటి టార్లే చేపల వినియోగాన్ని తగ్గించడం లేదా తొలగించడం చేయాలి. గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన విషయాలు గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన విషయాలు × మీరు మాంసాహారంగా ఉంటే, ప్రతి సేవకు 85 గ్రాముల మాంసాన్ని మించకూడదు. × ఐస్ క్రీం, వేయించిన స్నాక్స్, సలాడ్ డ్రెస్సింగ్ మొదలైనవాటికి దూరంగా ఉండాలి. × మీ శరీర బరువును కంట్రోల్లో ఉ ంచడానికి క్రమం తప్పకుండా తగినంత నీరు త్రాగాలి × తగినంత కార్బోహైడ్రేట్లు తినండి × రాళ్లను కరిగించడానికి చిన్న మొత్తంలో ఆరెంజ్ ఫ్రూట్ మరియు నిమ్మరసం తినండి.

# మీకే కాదు, మీ పక్కవారికి కూడా ఇబ్బంది కలిగించే చెమట వాసనకు వీడ్కోలు చెప్పాలనుకుంటున్నారా?




శరీర వాసన చాలా మంది తమ దైనందిన జీవితంలో ఎదుర్కొనే సమస్య. అందుకు వివిధ కారణాలు ఉంటాయి, ముఖ్యంగా కొన్ని ఉత్పత్తులు, ఆహారాలు, శారీరక శ్రమ ప్రధానకారణం కావచ్చు. కానీ బహిరంగ ప్రదేశాలకు వెళ్ళేటప్పుడు, మీరు ఎల్లప్పుడూ ఎక్కువగా చెమట పడుతుంటే, మీరు చాలా ఇబ్బందిని ఎదుర్కోవలసి ఉంటుంది. ఒక వ్యక్తి ఎక్కువగా చెమట పట్టడానికి చెమట గ్రంథులు ఎక్కువగా పనిచేస్తాయి. చర్మంలోని బ్యాక్టీరియాతో పాటు చెమటలు పట్టడం వల్ల తీవ్రమైన వాసన వస్తుంది. ప్రతిదీ చాలా చెమటలు పట్టే కారణాలు ఎవరికైనా తెలుసా? అధిక కెఫిన్ పానీయాలు, కొన్ని మందులు, కారంగా ఉండే ఆహారాలు, గట్టి దుస్తులు, నిర్జలీకరణం, ఒత్తిడి మరియు ఉద్రిక్తత, మద్యపానం, సరైన ఆహారం, హార్మోన్ల మార్పులు మరియు యుక్తవయస్సు ప్రధాన కారణాలు. ాజీఎ ఃఎవ-ఎఎవ ఎనీ ఃనీటఎ ాటనీబీతీ చితిబిష్ట్ర ుష్ట్రవబవ ఖీవఎవటతివబ తిని ుఎశ్రీబీణబీ కొంతమంది శరీర దుర్వాసన నుండి బయటపడటానికి డియోడరెంట్లను ఉ పయోగిస్తారు. అయితే ఆ దుర్గంధనాశని తాత్కాలికమేనని మర్చిపోవద్దు. శరీర వాసన నుండి శాశ్వత పరిష్కారం కావాలంటే, మీరు శుభ్రంగా ఉ ండాలి మరియు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలి. శరీర దుర్వాసన నుండి బయటపడటానికి కొన్ని సహజ మార్గాలు ఉన్నాయి. క్రింద ఆ సాధారణ సహజ పరిష్కారాలు ఉన్నాయి. ఇది చదివి దానిని అనుసరించండి మరియు శరీర వాసనకు వీడ్కోలు చెప్పండి. వంట సోడా వంట సోడా బేకింగ్ సోడా చర్మం నుండి తేమను పీల్చుకోవడానికి మరియు శరీర వాసనను తగ్గించడానికి సహాయపడుతుంది. ఇది బ్యాక్టీరియాను కూడా చంపుతుంది మరియు సహజ దుర్గంధనాశని వలె పనిచేస్తుంది. 1 టేబుల్ స్పూన్ బేకింగ్ సోడాను 1 టేబుల్ స్పూన్ నిమ్మరసంతో కలపండి, చంకలలో రుద్దండి, కొన్ని నిమిషాలు నానబెట్టి చల్లటి నీటితో శుభ్రం చేసుకోండి. మంచి ఫలితం పొందడానికి రోజూ కొన్ని వారాలు దీన్ని క్రమం తప్పకుండా అనుసరించండి. ఆల్కహాల్ ఆల్కహాల్ శరీర దుర్వాసనకు ఆల్కహాల్ మరొక ఔషధంగా చెప్పవచ్చు. ఇది సులభంగా ఆవిరైపోతుంది మరియు వాసనను తగ్గిస్తుంది. ఇది రంధ్రాలను కూడా మూసివేస్తుంది మరియు చెమట ఉ త్పత్తిని తగ్గిస్తుంది. ఒక పత్తి బంతిని తీసుకొని, దానిని ఆల్కహాల్‌లో నానబెట్టి, చంకలలో రుద్దండి, కొన్ని నిమిషాలు నానబెట్టి, తరువాత కడగాలి. కాకపోతే, ఒక కప్పు నీటిలో కొద్దిగా ఆల్కహాల్ కలపండి మరియు చంకలను కడగాలి. ఆపిల్ సైడర్ వెనిగర్ ఆపిల్ సైడర్ వెనిగర్ ఆపిల్ సైడర్ వెనిగర్ లోని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు బ్యాక్టీరియా పెరుగుదలను నిరోధిస్తాయి. ఇది ఆరోగ్యకరమైన చర్మం జూఊని నిర్వహించడానికి మరియు శరీర వాసనను తొలగించడానికి సహాయపడుతుంది. ఆపిల్ సైడర్ వెనిగర్ ను కాటన్ బాల్ లో నానబెట్టి, చంకలలో రుద్ది, 2-3 నిమిషాలు నానబెట్టి, తరువాత నీటితో శుభ్రం చేసుకోండి. రోజూ ఉదయం మరియు రాత్రి పడుకునే ముందు 2 సార్లు ఇలా చేయడం వల్ల చెమట వాసన తొలగిపోతుంది. రోజ్ వాటర్ రోజ్ వాటర్ రోమ్ వాటర్ చంక వాసన నుండి బయటపడటానికి సహాయపడుతుంది. చంకలపై కొద్దిగా రోజ్ వాటర్ రాయండి. కాకపోతే, స్నానపు నీటిలో కొద్దిగా రోజ్ వాటర్ కలపండి మరియు స్నానం చేయండి. అందువలన శరీరం రోజంతా మంచి వాసనతో ఉంటుంది. టమాట గుజ్జు 5ల ఖం ఎక్కువ జీతం? మీ వయస్సు నమోదు చేసి 1 అతీ టర్మ్ లైఫ్ కవర్ అర్హత చెక్. ుఎతీఎ ఒతిటవ ఎనిబబీతీజీనిఇవ ప్రపంచంలోని అతిపెద్ద లాటరీలు భారతదేశానికి వస్తాయి లైఫ్ కవర్ కొనండటమాట గుజ్జు టవెూటాలలోని ఆమ్లత్వం వాసన కలిగించే బ్యాక్టీరియాను చంపి రంధ్రాలను తగ్గిస్తుంది. అందువల్ల ఇది శరీరం నుండి చెమట వీచే వాసనను తగ్గించడానికి సహాయపడుతుంది. టొమాటో పేస్ట్‌ను నేరుగా చంకలపై వేసి 15 నిమిషాలు నానబెట్టి, చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. మీరు కొన్ని వారాలు ప్రతిరోజూ దీనిని అనుసరిస్తే, మీరు మంచి ఫలితాన్ని పొందవచ్చు. నిమ్మకాయ నిమ్మకాయ శరీర దుర్వాసన నుండి బయటపడటానికి పురాతన కాలం నుండి నిమ్మకాయను ఉ పయోగిస్తున్నారు. రోజూ స్నానం చేసే ముందు, నిమ్మకాయ ముక్కను చంకలో రుద్దండి. బాగా ఎండిన తరువాత, స్నానం చేయండి. రోజూ ఇలా చేయడం వల్ల శరీర దుర్వాసన రాకుండా ఉంటుంది. పాలకూర పాలకూర పాలకూర శరీర వాసనను నివారించడానికి సహాయపడే ఆకుకూర. కొద్దిగా పాలకూర రసాన్ని నేరుగా చంకలపై వేయండి. ఉత్తమ ఫలితాల కోసం, స్నానం చేసిన తరువాత, ఈ బచ్చలికూర సారాన్ని చంకలపై పూయండి మరియు పొడిగా ఉంచండి. కావాలనుకుంటే, పాలకూర రసాన్ని ఫ్రిజ్‌లో భద్రపరుచుకుని రోజూ వాడవచ్చు. గంధపు పొడి గంధపు సౌందర్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది మరియు మంచి వాసన కలిగి ఉ ంటుంది. ప్రధానంగా చందనం చంకల నుండి వాసనను తొలగించడ ానికి సహాయపడుతుంది. గంధపు పొడి తీసుకొని చంకలపై పూయండి మరియు బాగా ఆరనివ్వండి.

# అన్ని రకాల జుట్టు సమస్యలను పరిష్కరించే అద్భుతమైన నూనెలు!



మందపాటి, మెరిసే మరియు మృదువైన జుట్టు కలిగి ఉండాలనే కోరిక మనందరికీ ఉంది. ప్రతి ఒక్కరూ వారి జుట్టును ఇష్టపడతారు. ఎందుకంటే జుట్టు ఒకరి ముఖం మరియు రూపాన్ని బాగా వ్యక్తపరుస్తుంది. కానీ ఈ రోజుల్లో చాలా మంది జుట్టు రాలడంతో బాధపడుతున్నారు. బిజీ జీవనశైలి, కలుషిత వాతావరణం, ఆహారం మరియు జుట్టు సంరక్షణ ఉత్పత్తులు దీనికి ప్రధాణ కారణం. ుష్ట్రవబవ మరియు ఈ రోజు ఎవరూ వారి తలపై నూనె పెట్టరు. తత్ఫలితంగా, జుట్టు ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు జుట్టుకు లభించవు. మీ జుట్టు ఆరోగ్యంగా ఉండాలని మరియు బయటకు పడకుండా ఉండాలని మీరు కోరుకుంటే, మీ తలపై తరచుగా నూనె వాడటం చాలా ముఖ్యం. ఇంకా, జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరిచే కొన్ని నూనెలను ఉపయోగించడం ద్వారా జుట్టు బలంగా మారుతుంది. ఈ వ్యాసం జుట్టుకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించగల అద్భుతమైన నూనెలను జాబితా మీ ముందు ఉంచుతోంది. మీ జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి వాటిని చదవండి మరియు వాడండి... ఆలివ్ నూనె ఆలివ్ నూనె ఆలివ్ నూనెలో అన్ని రకాల ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. పొడి జుట్టు ఉన్నవారికి ఇది అనుకూలంగా ఉంటుంది. దానికోసం నెత్తిమీద ఆలివ్ ఆయిల్ వేసి జుట్టుకు మసాజ్ చేయండి. అప్పుడు తల చుట్టూ వెచ్చని నీటిలో నానబెట్టిన గుడ్డను 20 నిమిషాలు నానబెట్టి, తరువాత షాంపూతో శుభ్రం చేసుకోండి. వారానికి ఒకసారి ఇలా పొడిబారడం మరియు జుట్టును సిల్క్ లాగా మృదువుగా ఉంచండి. అవోకాడో ఆయిల్ అవోకాడో ఆయిల్ అవోకాడో నూనె జుట్టును బలపరుస్తుంది మరియు చిక్కగా చేస్తుంది. అవోకాడో నూనె దెబ్బతిన్న జుట్టును సరిచేయడానికి అవసరమైన అన్ని పోషకాలను కలిగి ఉంటుంది. అవోకాడో నూనెను చర్మం మరియు జుట్టు మీద పూయండి, బాగా మసాజ్ చేసి 20 నిమిషాలు నానబెట్టండి. అప్పుడు మైల్డ్ షాంపూ ఉపయోగించి జుట్టును కడగాలి. దానిమ్మ విత్తన నూనె దానిమ్మ విత్తన నూనె మీకు ఎలుక వంటి జుట్టు ఉ ందా? నానబెట్టి, ఆపై జుట్టును గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోండి. ఆవ నూనె ఆవ నూనె జుట్టును మృదువుగా ఉంచడానికి ఆవ నూనెను పురాతన కాలం నుండి ఉపయోగిస్తున్నారు. జుట్టుకు తగిన ఆవ నూనె తీసుకొని వెచ్చగా వేడి చేయండి. తరువాత నెత్తిమీద మరియు జుట్టు మీద పూయండి, 30 నిమిషాలు నానబెట్ట జండి, తరువాత తేలికపాటి షాంపూ మరియు వెచ్చని నీటితో శుభ్రం చేసుకోండి. నువ్వుల నూనె నువ్వుల నూనెపొందిన నూనె మరియు ఇది పురాతన మెరుగుపర్చడానికి కూడా ఉపయోగించబడింది.



# సినిమా



## అదేంటి పాప అలా షాక్ ఇచ్చావ్..!



టాలీవుడ్ సక్సెస్ ఫుల్ హీరోయిన్స్ లిస్ట్ లో సీతారామం బ్యూటీ మృణాల్ ఠాకూర్ కూడా ఉంటుంది. అమ్మడు తెలుగులో చేసిన 3 సినిమాల్లో రెండు సూపర్ హిట్ అయ్యాయి. థర్డ్ సినిమాలో కూడా తన వరకు ఓకే అనిపించుకుంది. ఐతే సినిమా రిజల్ట్ అనేది కమర్షియల్ సక్సెస్ మీద ఆధారపడి ఉంటుంది కాబట్టి మృణాల్ ఠకూర్ ఖాతాలో ఒక ఫ్లాప్ పడినట్టే లెక్క. ప్రస్తుతం అమ్మడు అడివి శేష్ తో డెకాయిట్ సినిమా చేస్తుంది. ఆ సినిమా మీద చాలా హోప్స్ పెట్టుకుంది మృణాల్ ఠాకూర్. తెలుగులో చేస్తూనే బాలీవుడ్ లో ఆఫర్లు కొట్టేస్తుంది మృణాల్. ప్రస్తుతం ఆమె నటించిన సన్నాఫ్ సర్దార్ 2 రిలీజ్ కి రెడీ అవుతుంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో మృణాల్ పెళ్లిపై సంచలన వ్యాఖ్యలు చేసింది. తనకు కూడా త్వరగా పెళ్లి చేసుకోవాలి, పిల్లలని కనాలని ఉందని అన్నారు మృణాల్. తల్లి అవ్వాలని తానెప్పుడూ కలలు కంటానని ఆమె చెప్పింది. ఐతే దానికి మాత్రం అసలు తొందరలేదని షాక్ ఇచ్చింది. ప్రస్తుతం తనస్ దృష్టి అంతా కూడా కెరీర్ మీద ఉందని.. ఇంకా చేయాలా చేయాలనుకుంటున్నా అందుకే పెళ్లి, పిల్లలు విషయాల గురించి ఇప్పుడు అసలు ఆలోచించట్లేదని అంటుంది మృణాల్. దాదాపు పెళ్లిపై హీరోయిన్స్ అంతా చెప్పే ఆన్సర్ ఇదే కదా అనొచ్చు. కానీ మృణాల్ ఠాకూర్ ఇప్పుడప్పుడే స్థిర పడాలనే ఆలోచన లేదు కాబట్టే తాను పెళ్లిని కొన్నాళ్లు దూరం పెడుతున్నా అని అంటుంది. పెళ్లైన హీరోయిన్స్ ఎంతైనా కెరీర్ లో వెనకపడిపోతారు. దానికి చాలామంది హీరోయిన్స్ ని ఎక్సాంపుల్ గా తీసుకుంటాం. ఐతే మృణాల్ కూడా పెళ్లి, పిల్లలు అంటే కెరీర్ కి ఎండ్ కార్డ్ పడినట్టే అని ఫిక్స్ అయ్యింది. అందుకే అలాంటి వాటికి కాస్త దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. మృణాల్ నిర్ణయం ఆమె ఫ్యాన్స్ కి హ్యాపీ నెస్ తెస్తుంది. ఎందుకంటే పెళ్లైతే హీరోయిన్స్ లో మార్పులు రావడమే కాదు సినిమాల్లో చేసే అవకాశం కూడా రాదు. అందుకే పెళ్లి విషయంలో మొత్తం హీరోయిన్స్ అంతా కూడా ఒకటే రాగం పాడతారు. మిగతా వారి సంగతి పక్కన పెడితే మృణాల్ మాత్రం అనుకున్నది సాధించే దాకా పెళ్లి చేసుకునేది లేదని బల్ల గుద్ది మరీ చెబుతుంది. సో ఆమెను వెండితెర మీద ఇలానే చూస్తూనే ఉండిపోవచ్చు



## అనుష్కకు పోటీగా రష్మిక దిగుతోందా?



స్వీటీ అనుష్క ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'ఘాటీ' ఎన్నో వాయిదాల పర్వం అనంతరం సెప్టెంబర్ 6న రిలీజ్ కు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెలలోనే రిలీజ్ కావాల్సిన సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా మరోసారి వాయిదా పడింది. ఈసారి మాత్రం ఎలాంటి గందరగోళానికి గురి కాకుండా ఓ నెల రోజులు సమ యం ఎక్కువగానే తీసుకున్నారు. ఆగస్టు ముగింపు కల్లా అన్ని పనులు పూర్తయితే అనుకున్న తేదీకి రిలీజ్ చేయోచ్చు అన్న ఆలోచనతో ఇంత లాంగ్ గ్యాప్ తీసుకున్నారు. సెప్టెంబర్ 6న మాత్రం పక్కాగా రిలీజ్ అవ్వడం ఖాయమంటున్నారు. ప్రచారం పనులు కూడా ఆగస్టు మిడ్ నుంచే ప్రారంభిం చాలని చూస్తున్నారుట. భారీ ఎత్తున ప్రీ రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. ఆ వేడుకకు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ను గెస్ట్ గా హాజరయ్యే అవకాశం ఉంది. ఇలా సినిమాకు అన్ని వైపులా పాజిటివ్ బజ్ తీసుకొస్తున్నారు. అయితే సరిగ్గా 'ఘాటీ'కి ఒక్క రోజు ముందుగానే స్వీటీకి పోటీగా నేషనల్ క్రష్ బరిలోకి దిగుతోంది? అన్న వార్త ఇప్పుడు సంచలనంగా మారుతోంది. రష్మికా మందన్నా ప్రధాన పాత్రలో 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రం తెరకె క్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో అంచనాలు పీక్స్ కు చేరాయి. రష్మిక చేస్తోన్న సరికొత్త ప్రయోగం ప్రేక్షకుల్ని అలరించడం ఖాయమంటున్నారు. రష్మికకు పాన్ ఇండియాలో క్రేజ్ ఉంది. అమ్మడికి అన్ని భాషల్లోనూ అభిమా నులు న్నారు. ఈ నేపథ్యంలో రష్మిక సినిమా రిలీజ్ అయితే ఘాటీకి గట్టి పోటీ తప్పదేనే సంకేతాలు అందుతున్నాయి. అనుష్క ఇప్పటికే సక్సెస్ ఫాం కోల్పోయింది. నత్తనడకన సినిమాలు చేస్తోంది. సినిమాలపై ఏమాత్రం సీరియస్ నెస్ కనిపించలేదు. రష్మిక ప్రయాణం అందుకు భిన్నంగా సాగుతుంది. ఈనేపథ్యంలో నటిగా స్వీటీ సీనియర్ అయినా? రష్మిక ధాడిని తట్టుకుంటుందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రెండు రిలీజ్ లకు సంబంధించి అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

## కేతిక శర్మ ప్రయాణం కూడా రాశీఖన్నాలా!



ఇండస్ట్రీలో హిట్లతో పనిలేకుండా కొంత మంది భామలకు లక్కీగా అవకాశాలు అందుకుంటుంటారు. టాలీ వుడ్ లో కొన్నాళ్ల పాటు రాశీఖన్నా కెరీర్ అలాగే సాగింది. ఎన్ని పరాజయాలు ఎదురైనా అమ్మడు కొత్త అవ కాశాలు అందుకుంటూ సాగింది. ఇలా ఎంత కాలం అంటే? అవకాశాలు వచ్చినంతకాలం సాగుతుంది. అప్పుడప్పుడు యావరేజ్ గా ఆడిన సినిమాలు కూడా లెక్కలోకి రావడంతో కొన్నాళ్ల పాటు బండి లాంగించింది. కానీ ఒక్కసారిగా టాలీవుడ్ లో ఛాన్స్ లు నిల్ అవ్వడంతో తమిళ్, హిందీ అంటూ పర భాషలవైపు కాన్సంట్రేట్ చేసి అటెళ్లింది. తాజాగా మురో ముంబై బ్యూటీ కేతిక శర్మ కెరీర్ కూడా టాలీవుడ్ లో అలాగే సాగుతున్నట్లు కనిపిస్తుంది. 'రొమాంటిక్' చిత్రంతో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన అమ్మడు అటుపై చెప్పుకోదగ్గ సినిమాలే చేసింది. 'లక్ష్య', 'రంగ రంగ వైభవంగా', 'బ్రో', 'రాబిన్ హుడ్' లాంటి పెద్ద చిత్రాలే చేసింది. కానీ ఇవేవి కూడా హిట్ అవ్వలేదు. అయినా సరే అమ్మడు కొత్త అవకాశాలు అందుకుంటూనే ఉంది. ఇటీవలే రిలీజ్ అయిన 'సింగిల్' తో మాత్రం డీసెంట్ హిట్ అందుకుంది. ఈసినిమా అమ్మడికి బూస్టింగ్ లా నిలిచింది. ఇప్పటి వరకూ కెరీర్ కి హిట్టే లేని భామకు తొలి హిట్ నమోదైంది. ఈ నేపథ్యంలో కేతిక కు కొత్త అవకాశాలు క్యూ కడుతున్నాయనే విషయం లీకైంది. చిన్న నిర్మాతలంతా కేతిక వైపే చూస్తున్నారు. పారితోషికం పరంగానూ ఎలాంటి డిమాండ్ కూడా లేని నేపథ్యంలో నిర్మాతలు సౌకర్యంగా ఫీలవుతున్నారు. యంగ్ హీరోలకు పర్ఫెక్ట్ ఛాయిస్ గా నిలుస్తుంది. ఇప్పటికే ఓ ఇద్దరు నిర్మాతలు అడ్వాన్స్ లు చెల్లించి లాక్ చేసినట్లు సమాచారం. దీంతో కేతిక కూడా ఫుల్ ఖుషీగా ఉన్నట్లు కనిపిస్తుంది. వరుస పరాజయాల నేపథ్యంలో కేతిక శర్మ కెరీర్ ముగిసినట్లేనని అంతా భావించారు. ఇతర భాషల్లో కూడా అవకాశాలు రాకపోవడంతో తిరిగి ముంబై వెళ్లడమే ఆలస్యమన్నట్లు ప్రచారం మొదలైంది. సరిగ్గా అలాంటి సమయంలోనే 'సింగిల్' విజయం కొండంత భరోసా కల్పించింది. త్వరలోనే అమ్మడు కొత్త ప్రాజెక్ట్ ల వివరాలు వెల్లడించనుందని సమాచారం.

## శ్రీలీలకు కంబ్యాక్ ఇచ్చేది ఏ హీరో!



శ్రీలీలకు సరైన హిట్ పడి చాలా కాలమవుతుంది. 'భగవంత్ కేసరి' తర్వాత చాలా సినిమాలు చేసింది. కానీ అవేవి సక్సస్ తీరాన్ని చేరలేదు. మధ్యలో 'గుంటూరు కారం' యావరేజ్ గా ఆడింది. హీరోయిన్ గా నటించిన 'ఆదికేశవ', 'ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్','రాబిన్ హుడ్', లేటెస్ట్ రిలీజ్ 'జూనియర్' అన్ని బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టిన సినిమాలే. చివరికి ఆమె సినిమాలు ఎప్పుడు రిలీజ్ అవుతున్నాయో? ఎప్పుడు పోతున్నాయో ? కూడా తెలియని పరిస్థితుల్లోకి వెళ్లిపోయింది. దానికి తోడు ఈ మధ్య కాలంలో టాలీవుడ్ అవకాశాల్ని కాదని ఇతర భాషలపై దృష్టి పెడుతోంది. ఇప్పటికే రెండు తెలుగు సినిమా ఛాన్సులు వదులుకున్న సంగతి తెలిసిందే. దీంతో శ్రీలీల స్ట్రాంగ్ కంబ్యాక్ కోసం అంతే ఆసక్తిగా ఎదురు చూస్తుంది. మరి ఆ సినిమా ఏది అవుతుందో చూడాలి. ప్రస్తుతం లైనప్ లో మాత్రం కొన్ని సినిమాలు కనిపిస్తున్నాయి. మాస్ రాజా రవితేజ హీరోగా 'మాస్ జాతర' తెరకెక్కుతోంది. ఇందులో శ్రీలీల హీరోయిన్. అలాగే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తోన్న 'ఉస్తాద్ భగత్ సింగ్' లోనూ ఈ బ్యూటీనే నటిస్తోంది. అటు కోలీవుడ్ లో శివకార్తికేయన్ నటిస్తోన్న 'పరాశక్తి' లోనూ నటిస్తోంది. బాలీవుడ్ లో కార్తిక్ ఆర్యన్ తోనూ ఓ సినిమా చేస్తోంది. అదే ఆషీకి 3. ఇవన్నీ ఆన్ సెట్స్ లో ఉన్న చిత్రాలు. ఈ చిత్రాల పై భారీ అంచనాలున్నాయి. మరి వీటిలో ఏ సినిమాతో హిట్ అందుకుని స్ట్రాంగ్ గా కంబ్యాక్ అవుతుందో చూడాలి. ముఖ్యం గా శ్రీలీల తెలుగు కంటే తమిళ్, హిందీ భాషలపైనే ఎక్కువ ఫోకస్ పెట్టి పని చేస్తోంది. ఆ రెండు భాషల్లో చేస్తోన్న సినిమాలు మంచి విజయం సాధించాలని ఆశిస్తుంది. ప్రముఖంగా 'ఆషీకీ3' పై చాలా ఆశలు పెట్టుకుంది. ఈ సినిమాతో హిట్ అందుకుంటే? రొమాంటిక్ స్టార్ గా ముద్ర పడుతుంది. యువతలో క్రేజ్ రెట్టింపు అవుతుంది. బాలీవుడ్ లో ఇంకా మంచి అవకాశాలు అందుకేనే అవకాశం ఉంది. ఈ సినిమాలో హీరోయిన్ పాత్రకు నటనకు ఆస్కారం ఉంది. ఇలా ఇన్ని ఆశలతో 'ఆషీకీ 3' సక్సస్ కోసం ఎదురు చూస్తోంది.




Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**